
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
KHAMMAM
మంగళవారం 2 డిసెంబరు 2025




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఉమ్మడి జిల్లా ఖనిజాల గని

- ఇక్కడి పరిశోధనలు దేశాభివృద్ధికి ఉపయోగపడాలి
- ఆ లక్ష్యంతోనే మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో విలేకరుల సమావేశం

ఖమ్మం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లా ఖనిజాల గని అని, విద్యార్థులు ఇక్కడి ఖనిజాలపై పరిశోధన చేసి దేశ అభివృద్ధికి ఉపయోగ పడేలా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని రూపుదిద్దబోతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఏర్పాటవుతున్న ఈ తొలి ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించనున్న నేపథ్యంలో మంత్రి తుమ్మల సోమవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచానికే మార్గదర్శకంగా కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ రూపుదిద్దుకోబోతోందని.. ఉమ్మడి జిల్లాలో బొగ్గు, రాగి, ఐరన్‌ఓర్ (మిగతా 6వ పేజీలో)

చారిత్రక ఘట్టం నేడే!



- 'ఎర్త్ సైన్స్'ను ప్రజలకు అంకితం చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి తుమ్మల
- ప్రారంభోత్సవ అనంతరం బహిరంగ సభలో పాల్గొననున్న సీఎం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా అధికార యంత్రాంగం


సీఎం ఆవిష్కరించనున్న యూనివర్సిటీ నమూనా

■ కొత్తగూడెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి)

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చారిత్రక ఘట్టం రానే వచ్చింది. ఎంతోకాలం శ్రమించి ఏర్పాటు చేసి పెద్ద పెద్ద యూనివర్సిటీలు కూడా చిన్నబోయేలా కొత్త కోర్సులను తీసుకొచ్చి నెలకొల్పిన యూనివర్సిటీ ప్రారంభానికి సిద్ధమైంది. ప్రజాపాలన రెండేళ్ల పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన 'డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ'ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. కాగా సీఎం పర్యటనకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేయగా.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● దేశంలో ఎక్కడా లేని విధంగా..

అరుదైన ఖనిజాలకు నిలయంగా పేరొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దేశంలో ఎక్కడా లేనివిధంగా భూగోళ పరిశోధనలకు సంబంధించిన అన్ని రకాల కోర్సులతో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. భూగోళానికి సంబంధించి దేశ, విదేశాల్లో ఉన్న పలు యూనివర్సిటీల్లో సైతం ఒక్కో సబ్జెక్టు మాత్రమే ఉండేది. కాగా.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాకు ఉన్న యూనివర్సిటీ కొరతను తీర్చాలన్న సంకల్పంతో కొత్తగూడెంలో ఈ యూనివర్సిటీ ఏర్పాటు జరిగింది. అయితే ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు పలు ప్రతిపాదనలు కోరగా.. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇక్కడి పరిస్థితులకు అనుకూలంగా ఉన్న అంశాలతోపాటు, ప్రపంచస్థాయిలో సైతం ఎక్కడా లేని యూనివర్సిటీని ప్రతిపాదించారు. దానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఆరునెలలపాటు ప్రత్యేక నిపుణులతో సాధ్యాసాధ్యాలపై చర్చించి ఏర్పాటుకు నిర్ణయం తీసుకుని అసెంబ్లీలో ప్రకటించారు. అనంతరం దానికి దేశ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడైన, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించిన అనంతరం మంత్రివర్గం ఆమోదం పొందింది. కాగా ప్రస్తుతం భూగోళ శాస్త్రానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీలో బీఎస్సీ జియాలజీ, జియో ఎన్విరాన్‌మెంటల్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. కాగా యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతీ అంశంలోనూ తుమ్మల చొరవ చూపుతూ అన్నీ రకాల అనుమతులు మంజూరు అయ్యేందుకు కృషి చేశారు. అనుమతులతో పాటు యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించి కావాల్సిన నిధుల సమీకరణకు కూడా ఆయన పలు సంస్థలతో ఆయన సమన్వయం చేస్తూ వస్తున్నారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి సుమారు రూ. వెయ్యి కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా వేయగా.. సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి వాటిని సమీకరించేందుకు ఆయన కృషి చేస్తున్నారు.


ప్రస్తుతం ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ నిర్వహిస్తున్న భవనం

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సీఎం పర్యటనకు సంబంధించి అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. యూనివర్సిటీ ప్రాంగణంలో శిలాఫలకం, మౌలిక సదుపాయాలు, సభాస్థలి ఏర్పాట్లు, రవాణా లాంటి అన్ని అంశాల్లో పనులు పూర్తి చేశారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు పనులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు ఎస్పీతోపాటు, ఐదుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 62 మంది ఎస్సైలు, 300మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 160 మంది హోంగార్డులు, ఏడు స్పెషల్ పార్టీలు, రెండు ఏఆర్ ప్లాటూన్స్‌తో కలిపి మొత్తం 900మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నట్టు తెలిపారు. వారిని 15సెక్టార్లుగా విభజించి, ఆయా సెక్టార్లకు డీఎస్పీలను ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్టు తెలిపారు.

భవిష్యత్ తరాలకు కొత్త అవకాశాలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం కేంద్రంగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని స్థాపించాలనుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం భవిష్యత్ తరాలకు శాస్త్రీయ ప్రపంచంలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ స్థాపన తెలంగాణ విద్యా రంగంలో చారిత్రాత్మక ఘట్టమన్నారు. కొత్తగూడెం ప్రాంత భౌగోళిక ప్రత్యేకతలు, ఖనిజ సంపద, పర్యావరణ వైవిధ్యం భూ విజ్ఞాన రంగానికి అమూల్యమైన వనరుగా ఆయన పేర్కొన్నారు. భూగర్భ జలాలు, ఖనిజ సంపద నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ వంటి కీలక రంగాలకు నిపుణులను తీర్చిదిద్దడంలో యూనివర్సిటీ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ తెలంగాణ శాస్త్రీయ అభివృద్ధి ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని రాసే చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రజలందరూ అధికసంఖ్యలో పాల్గొని సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఆరంభం అదుర్స్



ఉమ్మడి జిల్లా షాపులకు తొలిరోజే రూ.33కోట్ల మద్యం సరఫరా

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాల ఆరంభం అదిరింది. 2025-2027 ఎక్సైజ్ సంవత్సరానికి కేటాయించిన వైన్‌షాపుల్లో సోమ వారం నుంచి మద్యం విక్రయాలు మొదలయ్యాయి. తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని 204వైన్‌షాపులకు వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి రూ.33కోట్ల మద్యం సరఫరా చేశారు. తొలిరోజు మొదటిరోజు ఐఎంఎల్ డిపో నుంచి 38,700 మద్యం కేసులు, 17,300 బీరు కేసులు వైన్‌షాపులకు సరఫరా చేశారు. గత ఎక్సైజ్ సంవత్సరం చివరి నెలరోజులు ఆశించిన మేర మద్యం విక్రయాలు జరగలేదు. మద్యం ప్రియులకు కోరుకున్న బ్రాండ్లు కూడా అందుబాటులో లేకుండా పోయాయి.

జిల్లా ఆస్పత్రిలో రోగి గుండెకు పేస్ మేకర్


కోలుకుంటున్న రోగితో జీజీహెచ్ వైద్యులు

- అరుదైన ఘనతను సాధించిన జీజీహెచ్
- ఆరోగ్యశ్రీలో రూపాయి ఖర్చులేకుండా ఆపరేషన్
- వైద్య బృందాన్ని అభినందించిన అధికారులు
- కృతజ్ఞతలు తెలిపిన రోగి బంధువులు

6

ప్రతీ పల్లెలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ గెలిపించాలి
- పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారికి సముచిత స్థానం
- రెండేళ్ల ప్రజాపాలనలో అన్ని హామీలు నెరవేర్చాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- డీసీసీ కొత్త అధ్యక్షుడు సత్యనారాయణ బాధ్యతల స్వీకరణకు హాజరు
- ఖమ్మంలో కార్యకర్తలు, నాయకుల ర్యాలీ


కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన నూతి సత్యనారాయణ, పక్కన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు

ఖమ్మం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ పల్లెలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, ఇందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దీంతో పాటు త్వరలో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నూతి సత్యనారాయణ సోమవారం ఖమ్మం డీసీసీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి హాజరయ్యారు. అంతకుముందు భట్టి, తుమ్మల.. నూతి సత్యనారాయణతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో ప్రణాళిక రూపొందించామని, ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.. రెండేళ్ల ప్రజాపాలనలో సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. పార్టీ పదవులతో పాటు ప్రభుత్వ పదవుల్లో కూడా సామాజిక న్యాయం పాటిస్తున్నామని (మిగతా 8వ పేజీలో)


సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొంగులేటి

రైతుల శ్రేయస్సే లక్ష్యం

- నష్టాలొస్తున్నా వారి కోసమే ఫ్యాక్టరీని నడుపుతున్నా
- 2026-27 సీజన్ నుంచి రైతులకు అరకేజీ పంచదార ఉచితంగా ఇస్తాం
- మధుకాన్ షుగర్స్ చైర్మన్ నామ నాగేశ్వరరావు
- పూజలు చేసి ఈ సీజన్ క్రషింగ్‌ను ప్రారంభించిన మాజీ ఎంపీ

6


కేన్ క్యారియర్‌లో చెరుకును వేస్తున్న నామా నాగేశ్వరరావు దంపతులు, అధికారులు, రైతులు

దుప్పుల వేట నిందితుల రిమాండ్

- ఘటనపై కొనసాగుతున్న అటవీశాఖ అధికారుల విచారణ


సత్తుపల్లి సబ్‌జైల్ వద్ద నిందితులను చూపుతున్న అటవీశాఖ అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి అర్బన్ పార్కులో చుక్కల దుప్పులను వేటాడిన ఘటనపై అటవీశాఖ జిల్లా అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ ఆధ్వర్యంలో అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ బృందాలు సోమవారం సత్తుపల్లిలో విచారణ నిర్వహించాయి. సత్తుపల్లికి చెందిన శ్రీరామ్‌ప్రసాద్‌తో పాటు గోపికృష్ణ వేటలో పాల్గొన్నారన్న విషయాన్ని నిర్ధారించుకున్న అటవీశాఖ అధికారులు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్ చేశారు. అటవీశాఖ నిబంధనల మేరకు వన్యప్రాణులను వేటాడిన నిందితులకు 12రోజులు జైలు శిక్ష విధించి సత్తుపల్లి సబ్‌జైలుకు తరలించారు. కాగా సత్తుపల్లి అర్బన్ పార్కు దుప్పుల వేటపై టాస్క్‌ఫోర్స్ అధికారుల విచారణ కొనసాగుతూనే ఉంది. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సిద్ధార్థవిక్రమ్‌సింగ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్తుపల్లి అర్బన్ పార్కులో చుక్కల దుప్పుల వేటపై కొందరు చేసిన ఫిర్యాదు మేరకు ఖమ్మం అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ బృందాలతో విచారణ చేపట్టామన్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేశామని, రిమాండ్ చేసి జైలుకు పంపామన్నారు. అయితే ఈ ఘటనపై ఇంకా విచారణ కొనసాగుతూనే ఉందని, వన్యప్రాణులను వేటాడిన, సహకరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రెండో విడత.. రెండో రోజు..

- ఉత్సాహంగా సాగుతున్న పంచాయతీ నామినేషన్ల ప్రక్రియ
- నేటితో ముగియనున్న దాఖలు గడువు



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండో విడతలో ఎన్నికలు జరిగే ఆరు మండలాల్లోని 183 గ్రామ పంచాయతీల్లో రెండోరోజు నామినేషన్ల దాఖలు కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం పలు గ్రామాల్లో అభ్యర్థులు ఉత్సాహంగా తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఆరు మండలాల్లో 183 పంచాయతీల్లో అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నారు. మొత్తం 183 సర్పంచ్ పదవులకు, 1,686 వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల స్వీకరణకు చివరిరోజు కావడంతో నామినేషన్లు అధిక సంఖ్యలో వస్తాయని అంచనా వేస్తున్నారు.

పది మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన వారిపై కలెక్టర్ చర్యలు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన పది మంది అధికారులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చర్యలు తీసుకున్నారు. వారికి ఆయన సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి పది మంది అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన ఎన్నికల విధులని, వీటిని సరిగ్గా చేసేందుకు సిబ్బందిని సన్నద్ధం చేసేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తే, హాజరు కాకపోవడమేంటని అసహనం వ్యక్తం చేశారు. కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానమివ్వాలని ఆ పది మందిని కలెక్టర్ ఆదేశించారు.



సైబర్ నేరంలో ఆ నలుగురు!

- హైటెక్‌సిటీ కేంద్రంగా కాల్‌సెంటర్ పేరుతో మోసం
- క్రైంలో నలుగురు ఖమ్మం జిల్లా వ్యక్తులు
- రూ.పది కోట్ల వరకూ ఆర్థిక నేరం
- ప్రధాన నిందితులు ఇద్దరు పరారీ.. మరో ఇద్దరి అరెస్టు
- రూ.కోటితో సర్పంచ్ పదవి కోసం ఒకరి విఫలయత్నం

వివరాలు 7లో..

ఆంధ్రా నుంచి ధాన్యం లారీల రాక.. అడ్డుకున్న కట్టుకాసారం రైతులు

- గుట్టుగా వ్యాపారుల దందా...
- పొంతన లేని సమాధానాలు చెప్పిన లారీడ్రైవర్లు
- 10 లారీలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అధికారులు

7

నేడు, రేపు ఎస్‌జీఎఫ్ అండర్ -17 టీటీ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళ, బుధవారాల్లో అండర్- 17 బాలుర, బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా బాధ్యులు తెలిపారు. పోటీల్లో 8 జిల్లాల జట్లు పాల్గొంటాయని, ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని అసోసియేషన్ సెక్రెటరీ, కోచ్ ఓలేటి సాంబమూర్తి తెలిపారు.

విజయ్‌మర్చంట్ ట్రోఫీకి భద్రాద్రి యువ కెరటం

అండర్-16 జట్టుకు గురువిద్వాన్



భద్రాచలం,డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ మెన్స్ అండర్-16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో పాల్గొనే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జట్టులో భద్రాచలం యువ క్రికెటర్ గురువిద్వాన్‌కు చోటు లభించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టును జూనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. ఇందులో భద్రాచలంకు చెందిన వికెట్ కీపర్ గురువిద్వాన్ ఉండటం విశేషం. మహారాష్ట్రతో 7 నుంచి 9 వరకు, సౌరాష్ట్రతో 12 నుంచి 14 వరకు ఆంధ్రాలో జరిగే మ్యాచ్‌లకు గురువిద్వాన్‌ను ఎంపిక చేశారు.

సమన్వయంతో పనుల్లో వేగం పెంచండి

- భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా చేపట్టండి
- మున్నేరు తీగల వంతెనను పర్యాటకంగా తీర్చిదిద్దాలి
- వచ్చే మార్చిలోగా పనులు పూర్తికావాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మండిసెంబరు1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, ట్రాన్స్‌కో, అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి పనులు వేగంగా సాగిచేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వచ్చే మార్చిలోగా పనులన్నీ పూర్తికావాలని సూచించారు. సోమవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి కార్పొరేషన్ పరిధిలోని పనులపై సమీక్ష నిర్వహించారు. భూసేకరణ జాప్యం పనులు నత్తనడకపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, తదితర శాఖలఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఖమ్మం పనుల అనుమతుల ఫైళ్లు హైదరాబాద్‌లో ఆపవద్దని వెంటవెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని అవసరమైతే ముందస్తు అనుమతులిచ్చి తరువాత క్లియరెన్స్ చేసుకోవాలన్నారు. మున్నేరు నదిపై నిర్మిస్తున్న కేబుల్‌బ్రిడ్జి నిర్మాణ 2026 మార్చిలోగా నిర్మాణం పూర్తి కావాలని సూచించారు. హైదరాబాద్ దుర్గం చెర్వు, కరీంనగర్ మానేరు నదిపై రెండు చోట్ల మాత్రమే కేబుల్ బ్రిడ్జిలు ఉన్నాయని మూడో బ్రిడ్జి ఖమ్మం మున్నేరుపై నిర్మాణం అవుతోందని వివరించారు. దీన్ని పర్యాటక శాఖకు అనుసంధానం చేసి ప్రపంచస్థాయిలో లైటింగ్ టెక్నాలజీని కేబుల్ బ్రిడ్జికి చేసి పర్యాటకులు మెచ్చేలే లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. మున్నేరుకి ఇరువైపులా నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులకు భూసేకరణ చేపట్టాలని, భూసేకరణ జాప్యంతో పనులు ఆపితే వచ్చే వరదల్లో మళ్లీ నష్టం తప్పదన్నారు. రిటైనింగ్ వాల్‌కు సంబంధించిన భూసేకరణ విషయంలో ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షించుకోవాలని సూచించారు. ఖమ్మంలో తాగు నీటి పైపులైన్లు, ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లు, పనులు కూడా వేగవంతంగా చేపట్టాలని సూచించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ భూసేకరణకు అవసరమైన పనులు క్షేత్రస్థాయిలో ప్రజలను ఒప్పించి చేపట్టాలని ఆదేశించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంవల్ల ఖమ్మంలో వర్షాకాలంలో ఖమ్మంలో ఇళ్లల్లోకి వచ్చే అవకాశం ఉండదన్నారు. ట్రాన్స్‌కో అధికారులు కూడా లైన్‌షిఫ్టింగ్ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. కమిషనర్ తోపాటు పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ రంజిత్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో డీఈ రామారావు, తహసిల్దార్లు, రాంప్రసాద్, సైదులు పాల్గొన్నారు.

ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీతో విశ్వవ్యాప్తంగా ఉపాధి

- యువతకు నూతన విద్యా, ఉపాధి అవకాశాలు
- జియాలజీ, జియోసైన్స్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సులు
- ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ

కొత్తగూడెంఎడ్యుకేషన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సు యూనివర్సిటీ కోర్సులతో యువతకు విశ్వవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. వైద్య, ఇంజనీరింగ్ కోర్సులకు ఇండియాలో మొదటిసారిగా ఎర్త్ సైన్స్ కోర్సులపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. భౌగోళిక పరిస్థితులను పర్యావరణాన్ని అధ్యాయనం ద్వారా, ప్రస్తుత పరిస్థితులు ఎదురెయ్యే సమస్యలు అధిగమించడానికి ఈ కోర్సులు దోహదపడతాయి.చైనా, జపాన్‌తదితరదేశాలు ప్రపంచ అవసరాలకు, దేశాభివృద్ధికి స్వయం సంవృద్ధికి విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని ఎర్త్ సైన్స్‌కోర్సులు మన రాష్ట్రంలోని కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సు యూనివర్సిటీని నెలకొల్పారు. ఈ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఏర్పాటు చేశారు. ప్రాముఖ్యత కలిగిన ఐఐటీ, ఎన్ఐటీ, బనారస్ హిందూయూనివర్సిటీ, బొంబాయి, ఉస్మానియా యూనివర్సిటీలో ఒకటి,రెండుసబ్జెక్టుల కోర్సులు మాత్రమే ఉన్నాయి. ప్రాముఖ్యత కలిగిన ఈ కోర్సులు దేశవిదేశాల్లో మంచి డిమాండ్ ఉంది అని ఎర్త్ సైన్స్ కోర్సులు ఒకేచోట ఏర్పాటు చేయడం విశేషం. కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ పేరుతో బీఎస్సీ, జియాలజీ కోర్సులు,జియోఎన్విరాన్మెంటల్ కోర్సులు ప్రారంభించారు. దోస్త్‌ద్వారా అడ్మిషన్లు జరుగుతాయి ఇంటర్మీడియట్ ఎంపీసీతో ఉత్తీర్ణత అయినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ మార్కుల ద్వారామెరిట్ ప్రకారం, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు .

కోర్సులు

బీఎస్సీ జియాలజీ, జియో ఫిజిక్స్ ,జియో కెమిస్ట్రీ, సబ్జెక్టులతో పాటు బీఎస్సీ ఎన్విరాన్మెంటల్ సైన్స్‌కోర్సులు కూడా ఇక్కడ ఉన్నాయి. బీఎస్సీ జియాలజీలో 60సీట్లు, బీఎస్సీ ఎన్విరాన్మెంటల్‌లో 60సీట్లు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఒక్కొక్కదానిలో 60 సీట్లు ఉన్నాయి.

కోర్సుల ఉపయోగాలు

బీఎస్సీ జియాలజీ

డిగ్రీ ప్రధానంగా ప్రకృతి విపత్తు, జియో కెమిస్ట్రీ, టెక్టానిక్ ప్లేట్లు, నేచర్ ఆఫ్ జియోగ్రఫీ ఫిజిక్స్, ఫిజికల్ మాథ్స్, ఎర్త్ సైన్స్ ఎన్విరాన్మెంటల్ మ్యాథ్స్, సబ్జెక్టులతో పాటు గణిత శాస్త్రాం ఉంటాయి. భూ రసాయనిక శాస్త్రం,అనువర్తన భూశాస్త్రం,గణితశాస్త్రం, నిర్మాణ భూగర్భ శాస్త్రం, అగ్ని శిలాజాల సబ్జెక్టులు ఉంటాయి. ఆయిల్ అండ్ నేచురల్ కమిషన్,జియాలజీ, ఇండస్ట్రియల్ మైనింగ్,మైనింగ్ మెటల్ ఇండస్ట్రీ, భూగర్భ పరిశోధనరంగాలు,జియాలజిస్టులు, మైండ్ సూపర్వైజర్లు, మెరైన్ జియాలజిస్టులు, హైడ్రోజియలజిస్టులు, పెట్రో జియాలజిస్ట్, ఎక్స్ప్లోరేషన్,ఆయిల్ కార్పొరేషన్,జియోఫిజిస్ట్ అడ్వైజర్, ఫీజీసిస్ట్,జియో ఫిజికల్ అడ్వైజర్ ఇన్ ఎక్స్ప్లోరేషన్, పరిశోధన రంగాల నియామకాలు, హైడ్రో జియోకెమిస్ట్, ఎల్ఐసీ ఎనలైటింగ్ జియో కెమిస్ట్, తదితర ఉపాధి అవకాశం పొందడానికి వీలు కలుగుతుంది.

బీఎస్సీ ఎన్విరాన్మెంట్లు సైన్స్

దీనిలో ఎర్త్ సైన్స్ జియాలజీ, ఈకాలజీ, ఎన్విరాన్మెంటల్ కెమిస్ట్రీ, జియోగ్రఫీ ,జీఐఎస్ రిమోట్‌సెన్సింగ్, ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ సబ్జెక్టులు ఉంటాయి. ఎన్విరాన్మెంటల్ ఫారెస్ట్, ఫారెస్ట్ వైల్డ్ లైఫ్, ఎర్త్ సైన్స్‌జిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, వాటర్ ట్రీట్మెంట్, వైల్డ్‌లైఫ్ బయాలజిస్ట్, మైక్రో బయాలజీ రిసోర్సెస్ ,స్పెషలిస్ట్ ఎన్విరాన్మెంటల్ జర్నలిస్టు నియామకాలు పొందడానికి ఉపయోగపడతాయి.

వేతనాలు ఇలా..

పైకోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా కంపెనీలను బట్టి ఏడాదికి రూ.10 లక్షల నుంచి 20 లక్షల వరకు జీతభత్యాలు ఉంటాయి. ఇతర దేశాలలో ముఖ్యంగా అరబ్ దేశాలలో పైకోర్సులకు ఎక్కువ డిమాండ్ ఉంది.



రైతుల శ్రేయస్సే లక్ష్యం

- నష్టాలొస్తున్నా.. ఫ్యాక్టరీని నడుపుతున్నా...
- 2026-27 నుంచి రైతులకు అరకేజీ పంచదార ఇస్తాం
- మధుకాన్ షుగర్స్ చైర్మన్ నామా నాగేశ్వరరావు

నేలకొండపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): చెరుకు రైతుల శ్రేయస్సే లక్ష్యంగా మధుకాన్ యాజమాన్యం ముందుకు సాగుతోందని చైర్మన్ నామా నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం ఉదయం 2025-2026 క్రషింగ్ సీజన్‌ను నామా ప్రారంభించారు. తొలుత శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఫ్యాక్టరీ అధికారులు, రైతులతో కలిసి కేన్ క్యారియర్‌లో చెరుకును వేసి చెరుకు గానుగను ప్రారంభించారు. అనంతరం నామా నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ కార్మాగారాన్ని టేకోవర్ చేసినప్పటి నుంచీ ఆర్థికంగా భారీగా నష్టపోయామన్నారు. రైతుబిడ్డగా, రైతుల కష్టాలు తెలిసిన వాడిగా రైతన్నలకు అండగా ఉంటూ రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఫ్యాక్టరీని నడిపిస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే ఏపంచదార కర్మాగారంలో లేని విధంగా చెరుకు రైతుల కోరిక మేరకు 2026-27 సీజన్లో టన్ను చెరుకు సరఫరా చేసిన రైతులకు అరకిలో పంచదారను ఉచితంగా ఇస్తామని నామా ప్రకటించారు. రైతులు చెరుకు పంటను విరివిగా సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని, తద్వారా రైతులు అభివృద్ధి చెందాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని పంచదార కర్మాగారాల కంటే కూడా మధుకాన్ చెరుకు రైతులకు ఎక్కువ మద్దతు ధరను ఇస్తున్నదని నామా స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎండి నామా కృష్ణయ్య, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా రైతులఅభివృద్ధి కోసం ఫ్యాక్టరీని ముందుకు తీసుకెళ్ళటానికే ప్రయత్నం చేస్తామని నామా నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చెరుకు రైతులు తలశీల గోపాలరావు, సూరపనేని రామకృష్ణ, యాసా విష్ణువర్ధన్‌రెడ్డి,నెల్లూరి భద్రయ్య, బెల్లం పుల్లయ్య, సీపీసీ రవీందరరావు, ఏవీపీ వై.కోటయ్య, డీజీఎం కేన్ అప్పారావు, హెచ్‌ఆర్ నరేష్ పాల్గొన్నారు.



చెరుకు బండిని తీసుకెళుతున్న నామా నాగేశ్వరరావు

సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే సీనియర్ పురుషుల, మహిళల జిల్లా కబడ్డీ జట్లను ఈనెల ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది పాల్గొన్నారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియోషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు తెలిపారు. పురుషుల జట్టులో ఆజాద్,యశ్వంత్,నాగరాజు, అశోక్, సాయికుమార్, రామక్రిష్ణ, తరుణ్, అజయ్, ప్రవీణ్, హనుమంత్, అనిల్, గోపి, పవన్ సాయి, రాజ్‌కుమార్, గోపి, జగదీష్, రాజేష్, హరిక్రిష్ణ, అశోక్ మహిళల జట్టులో భవాని పూజిత, ప్రియాంక, విజయశ్రీ, సువన్య, మేఘన, ప్రనూష, కుసుమ, నాగేశ్వరి, అఖిల, అన్విత, హసిని, స్వప్న, కావ్య, భావన, భార్గవి, కృష్ణవేణి, వినీల, హాసిని, హర్షిణి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 11 నుంచి 14 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

31మందిపై బైండోవర్ కేసుల నమోదు

మధిర రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరగాలంటే గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలను కట్టడి చేయాలని మధిర రూరల్ సీఐ డి.మధు పేర్కొన్నారు. సోమవారం మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ,చేశారు. గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న 31మంది నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ముసుగులో పెరిగిన మద్యం దుకాణాలు

- జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కొత్త గూడెం కార్పోరేషన్ ముసుగులో మద్యం దుకాణాలు పెరిగాయని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కార్పోరేషన్ పరిధిలో కలిపితే అభివృద్ధి జరుగుతుంది అను కుంటే, అలా కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారేలా చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లిఖార్జునరావు, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, వినయ్, గజ్జెల శంకర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

ఖమ్మం క్రైం, డిసెంబరు 1: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను ఖమ్మం త్రిటౌన్ పోలీసులు సోమవారం అదదుపులోకి తీసుకున్నారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల వద్దకు నవంబరు 29న డిగ్రీ పరీక్షలు రాసేందుకు కొంతమంది విద్యర్థులు వచ్చారు. వారు తమ సెల్‌ఫోన్లను ఓ ద్విచక్రవాహనం డిక్కీలో పెట్టి పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష అనంతరం వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో బోనకల్‌కు చెందిన మహేందర్ అనే విద్యార్థి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తుండగా నగరంలోని కాల్వఒడ్డు ప్రాంతంలో తలంపాడు గ్రామానికి చెందిన అలంతోటి రాము, వైరా మండలం గొల్లపూడికి చెందిన షేక్ నాగుల్‌మీరా అను వారు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. నగరంలోని ఓ అడ్డాపై పనికి వచ్చిన వారు డిగ్రీ కళాశాల వద్దకు వచ్చి చోరీకి పాల్పడినట్లు విచారణలో తెలిందన్నారు. అదే విధంగా గత వారం రోజుల క్రితం గాంధీచౌక్‌లోని ఓ బ్యాంకు ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని సైతం చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నారన్నారు. దీంతో వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

మెప్మా ఉద్యోగుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



డిప్యూటీ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న సుజాతరాణి

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాత రాణి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సోమవారం ఖమ్మంనగరంలో ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఏప్రిల్ నుంచి నవంబరు వరకు వేతనాలు రాలేదని, సెప్టెంబరు మాసం వరకు వేతనాలు బిల్లులు మంజూరు జరిగినా ఆర్థికపరమైన క్లీయరెన్స్ రాకపోవటంతో రూ.7.97 కోట్ల వేతనాల చెక్కులు ఖజానాలో పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఎస్‌కే సల్మా, గోప్పాచి ఉపేంద్రమ్మ, చిలకా ద్రౌపది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా

ఖనిజాల గని

(5వ పేజీ తరువాయి)

గ్రానైట్, గ్రాఫైట్, షైలతుత్తం, బాక్సైట్ ఇలా పలు ఖనిజాలు అందుబాటులో ఉన్నాయని, వీటినిదృష్టిలో ఉంచుకొని ఇక్కడ మన్మోహ న్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఒకప్పుడు సింగరేణి మైనింగ్ కాలేజీగా సింగరేణికి సంబంధించిన మైనింగ్ కోర్సులు మాత్రమే ఇక్కడ ఉండేవని, తాను కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చి ఇంజనీరింగ్ కాలేజీగా అభివృద్ధి చేశానన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు యూనివర్సిటీకి లేనందున ఈ జిల్లాలో యూనివర్సిటీ కావాలని ముఖ్యమంత్రిని అడిగిన వెంటనే సానుకూలత తెలిపారని, దానికి అనుగుణంగా కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని తాను ప్రతిపాదించానన్నారు. దీనికిఅనుగుణంగా సీఎం కూడా సైన్స్ యూనివర్సిటీ ఆవశ్యకతపై నిష్ణాతులతో సమాచారం తెలుసుకొని అంగీకరించారన్నారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రానికే కాకుండా దేశానికే పేరుతెస్తుందన్నారు. ఇక్కడ ఉన్న ఖనిజ సంపదను వస్తువులుగా తీర్చిదిద్దే శాస్త్రవేత్తలు, పరిశోధకులను తయారు చేయటం ఈ యూనివర్సిటీ లక్ష్యం అన్నారు. ఇక్కడి ఖనిజ ముడి సరుకు చైనా వెళ్లి మళ్లీ దేశానికి వస్తోందని, అందుకే ఈ యూనివర్సిటీ దేశ విద్యారంగానికే కాదు ప్రపంచానికే మార్గదర్శకం వహించేలా ఎర్త్ సైన్స్ వర్సిటీలో శాస్త్రవేత్తలను, పరిశోధకులను తయారు చేయబోతోందన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతున్న ఈ యూనివర్సిటీకి రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, పదేళ్లు దేశానికి ప్రధానిగా ఉండి.. తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహనీయుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును పెట్టాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదం దక్కిందన్నారు. ఈ యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేటివ్ భవనంతో పాటు తరగతులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, ఈ యూనివర్సిటీలో దేశం నలుమూలలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకునే అవకాశం దక్కబోతోందని, అవసరమైన సైన్స్ కోర్సుల్లో చదువుకుని రాణించే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే ఖమ్మంలో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జిని పర్యాటక వంతెనగా అభివృద్ధి చేయబోతున్నామని, రాష్ట్రంలో ఇప్పటివరకు ఇలాంటి బ్రిడ్జిలు రెండు మాత్రమే ఉన్నాయని ఖమ్మంలో నిర్మించే బ్రిడ్జి పొడవైనదన్నారు. బ్రిడ్జిని లైటింగ్‌తో సుందరీకరించబోతున్నామని, పర్యాటకులు ఈ బ్రిడ్జిని చూసి ముచ్చటపడేలా చేయబోతున్నామన్నారు. మున్నేరుకు వరద కట్టల పనులు, అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేయబోతున్నామని మంత్రి తుమ్మల వివరించారు.

విమర్శించే వాళ్లు ఎన్నికల కోడ్ నిబంధనలేమిటో తెలుసుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండేళ్ల ప్రజా పాలనలో సాగించిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు పట్టణ బాట కింద పర్యటిస్తుంటే కొందరు ఎన్నికల కోడ్ నిబంధనల గురించి తెలుసుకోకుండా విమర్శలు చేయటం తగదన్నారు. పంచాయతీ ఎన్నికలకు మున్సిపల్ ఎన్నికలకు నిబంధనలు ఎలా ఉంటాయో ముందు తెలుసుకోవాలన్నారు.

పంచాయతీ ఎన్నికల కోడ్ నిబంధనలు గ్రామాలకే పరిమితమని, పట్టణాల్లో పర్యటనలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసుకోవచ్చని, ఎన్నికల నియమావళి గురించి తెలుసుకొని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, కార్పొరేటర్ కమర్తపు మురళి, వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షుడు సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మంలీగల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నర్తకి థియేటర్ ప్రాంతానికి చెందిన ఏ.రవిబాబు అలియాస్ బాబుకి చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.19లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురం కొత్తూరు గ్రామానికి చెందిన ఫిర్యాది వద్ద నిందితుడు తన వ్యాపార అవసరాల నిమిత్తం 2014లో రూ. 15లక్షల అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీ నోటు రాసి ఇచ్చాడు. 2016లో రూ.19 లక్షలకు నిందితుడు చెక్కును ఫిర్యాదికి ఇవ్వగా, అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేశాడు. నిందితుని ఖాతాలో సరిపడా నగదు లేనందున చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటుకేసు దాఖలు చేయగా కేసులోని సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

కౌలు రైతు ఆత్మహత్యపై విచారణ



విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

నేలకొండపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శంకరగిరి తండాలో అప్పుల బాధతో సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిన బానోత్ వీరన్న ఆత్యహత్యపై రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ జరిపారు. రెవెన్యూ అధికారులు మృతుని ఇంటి వద్దకు వెళ్లి అప్పులు ఎన్ని ఉన్నాయి..ఏఏ పంటలు సాగు చేశాడు.. అన్న విషయాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్థుల నుంచి కూడా వివరాలు సేకరించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. విచారణలో త హసీల్దార్లు ఆలస్యం మధుసూధన్‌రావు, అల్లం రవి తదితరులున్నారు.

ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో రోగి గుండెకు ఫేస్ మేకర్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘనతను సాధించారు. గుండె నెమ్మదించి తీవ్ర ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన వ్యక్తి పరిస్థితిని చూసి వైద్యులు చలించి పోయారు. ఒక్క రూపాయి ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీలో అతని గుండెకు 'ఫేస్ మేకర్' ను అమర్చి.. ప్రాణాపాయం నుంచి కాపాడారు. తాము కార్పోరేట్ ఆస్పత్రికి ఏమాత్రం తీసిపోమని జిల్లా ఆస్పత్రి వైద్యులు మరోమారు నిరూపించారు. వివరాల్లోకి వెళితే..

గత నెల 24వ తేదీన ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంకు చెందిన వెంకన్న తీవ్ర అపస్మారక స్థితిలో వచ్చాడు. ఆయన శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. గుండె విభాగంలో ఆయనకు డాక్టర్ సీతారాం నాయక్ పరీక్షలు నిర్వహించారు. సాధారణంగా నిమిషానికి 72సార్లు కొట్టుకోవాల్సిన వెంకన్న గుండె కేవలం 22సార్లు మాత్రమే కొట్టుకుంటోంది. పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూలో ఉంచి అతనికి తాత్కాలికంగా చికిత్స అందించారు. కానీ అది తాత్కాలికమేనని, ఆ తర్వాత అది పని చేయదని ఆ రోగికి ఇబ్బందిగా ఉంటుందనే విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నరేందర్ దృష్టికి తీసుకెళ్లారు. సూపరింటెండెంట్ నరేందర్ మానవతా దృక్పథంతో ఆలోచించి ఆరోగ్య శ్రీలో ఫేస్ మేకర్‌ని ఏర్పాటు చేద్దామని నిర్ణయించారు. నాలుగు రోజుల్లో దాన్ని రూ 3.50 లక్షల ఖర్చుతో హైదరాబాద్ నుంచి తెప్పించారు. ఈ నెల 28వ తేదీన జీజీహెచ్‌లోని క్యాథ్‌లాబ్‌లో డాక్టర్ సీతారాం నాయక్ బృందం వెంకన్న గుండెకు ఫేస్‌మేకర్‌ను అమర్చారు.



రోగి గుండెకు అమర్చిన ఎస్ఏనోడ్ పరికరం

● నాలుగు గంటల పాటు ఆపరేషన్

వెంకన్న గుండెలో ఎస్ఏనోడల్ అనే అవయవం పనిచేయకపోవడంతో గుండె లయ తప్పి ఇబ్బందిగా పరిణమించింది. ఫేస్‌మేకర్‌ను ఆయన గుండెలోకి చొప్పించి తిరిగి వెంకన్న హృదయాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు ఈ ఫేస్‌మేకర్ ఆపరేషన్ చేశారు. అది విజయవంతం కావడంతో ఆ రోగి తిరిగి కోలుకున్నాడు. హైదరాబాద్ స్థాయిలో నిమ్స్‌లో మాత్రమే చేసే ఈ అరుదైన ఆపరేషన్ ఖమ్మం లో.. అదీ ప్రభుత్వ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించడంతో.. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు తదితరులు వైద్యుడు సీతారాం నాయక్‌ను అభినందించారు. ప్రైవేటు ఆస్పత్రిలో కనీసం రూ. 5నుంచి 6లక్షలు ఖర్చు అవుతుందని, మానవతా దృక్పథంతో ఆలోచించి ఆరోగ్యశ్రీ ద్వారా అత్యంత ఖరీదైన ఫేస్‌మేకర్‌ను తెప్పించిన సూపరింటెండెంట్‌ను కూడా పలువురు అభినందించారు. కోలుకున్న రోగిని సోమవారం వైద్య బృందం పరిశీలించా రు. ఆయన పరిస్థితి పూర్తిగా కోలుకుందని మంగళవారం ఇంటికి పంపించనున్నట్లు తెలిపారు. ప్రాణాలు పోతాయనుకుని ఇక్కడికి వచ్చామని ప్రభుత్వ వైద్యులు తిరిగి తమ కుటుంబ పెద్దను కాపాడారని రోగి వెంకన్న కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఆశ్రమ విద్యార్థి

దుమ్ముగూడెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి కె.శ్రీరామ్ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడు. గతనెల 25, 26, 27 తేదీల్లో కొత్తగూడెంలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చారు. కె.శ్రీరామ్ వాటర్ కన్జర్వేషన్, మేనేజ్‌మెంట్ విభాగంలో మొదటి బహుమతి పొందాడు. సస్టైనబుల్ అగ్రికల్చర్ విభాగంలో ఎం.యశ్వంత్‌సాయి ద్వితీయ బహుమతి సాధించాడు. గైడ్ టీచర్లుగా కుంజా నాగేశ్వరావు, ఎ.ప్రతాప్, రాందాస్, రజితలు వ్యవహరించారు. వీరిని హెచ్‌ఎం పూనెం నర్సింహారావు, పీడీ హరికృష్ణ, చెన్నారావు లు సోమవారం అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

మాజీ సర్పంచి మడకం చంద్రశేఖర్



ఏకగ్రీవం కానున్న మడకం రోజా



నాడు భర్త... నేడు భార్య

తొలిసారి గంగోలు పంచాయతీ ఏకగ్రీవం

దుమ్ముగూడెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : గంగోలు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గత ఎన్నికల్లో భర్త ఎన్నికవగా, నేడు భార్యను ఆ పదవి వరించింది. గతంలో మాజీ సర్పంచ్ మడకం చంద్రశేఖర్ బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో పోటీచేసి గెలవగా, ప్రస్తుతం అతని భార్య మడకం రోజా ఏకగ్రీవంగా సర్పంచి పదవిని చేపట్టనుంది. మొదటిసారి నడికుడి గ్రామ పంచాయతీలో అంతర్భాగమైన గంగోలు, రెండోసారి సుబ్బారావుపేట నుంచి విడిపోయి గంగోలు గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. గంగోలు పంచాయతీకి ఇప్పటికి వరకు నాలుగుసార్లు ఎన్నికలు జరగగా, ప్రస్తుత ఎన్నికల్లో సర్పంచ్‌తో పాటు వార్డు పదవులకు సింగల్ నామినేషన్లు అందాయి. దీంతో ఆ పంచాయతీ ఏకగ్రీవం దిశగా ప్రక్రియ సాగుతోంది.

నామినేషన్ కేంద్రాల వద్ద సౌకర్యాలు నిల్



జగన్నాథపురం నామినేషన్ కేంద్రం వద్ద నిల్చున్న అభ్యర్థులు

పాల్వంచరూరల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 36 గ్రామపంచాయతీలు ఉండగా 3 గ్రామపంచాయతీలకు ఒక చోట నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం పలు నామినేషన్ కేంద్రాలలో సౌకర్యాలు లేక అభ్యర్థులు, బలపరిచే ఓటర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామపంచాయతీలు సౌకర్యాలు అంతంత మాత్రంగానే అధికారులు ఏర్పాటు చేశారని పలువురు అభ్యర్థులు ఆరోపణలు చేశారు. ఉల్వనూరు గ్రామపంచాయతీ నామినేషన్ కేంద్రం ఇరుకైన ప్రదేశంలో ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం ఎదురు డ్రైనేజీపై రెండు సిమెంట్ తోరలు వేశారు. దీంతో అది ప్రమాదకరంగా ఉందని అభ్యర్థులు వాపోయారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కేంద్రం లోపలికి వెళ్లలేని పరిస్థితులు ఎదురయ్యాయి. జగన్నాథపురం రైతు వేదిక ఎదురుగా మూడు గ్రామపంచాయతీలకు చెందిన నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థులు నిల్చోని నిరీక్షణ చేసే పరిస్థితి ఎదురైంది. పోటీ చేసే అభ్యర్థులకు కనీస సౌకర్యాలను కల్పించడంలో ఎలక్షన్ అధికారులు విఫలమయ్యారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పలు రాజకీయ పార్టీల నాయకులు సైతం అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

పల్లె సమరం 2025

సర్పంచ్‌గా 'కొండబాల' హ్యాట్రిక్

- విద్యార్థి దశ నుంచే సర్పంచ్‌గా...
- ఏకచత్రాధిపత్యంగా 25 ఏళ్లు...
- ఏకకాలంలో సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ పదవులు నిర్వహించిన ఘనత ఆయనదే!
- 1999లో మధిర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక



కొండబాల కోటేశ్వరరావు

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ సామాన్య రైతు కుటుంబానికి చెందిన ఆయన విద్యార్థి దశనుంచే రాజకీయ ఓనమాలు పునికిపుచ్చుకున్నారు. రాజకీయంగా ఆయనకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకపోయినప్పటికీ తన రాజకీయ చతురతతోనే అజాతశత్రువుగా విద్యార్థి దశ నుంచే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల నుంచి ఎమ్మెల్యేగా ఎదిగారు... ఆయనే మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు. ఆయన స్వస్థలం ఖమ్మంజిల్లా వైరా మండలంలోని కొండకొడిమ గ్రామం.

1948 డిసెంబరు ఏడున జన్మించిన కొండబాల కాంగ్రెస్ విద్యార్థి దశలోనే కాంగ్రెస్ రాజకీయాలను పునికిపుచ్చుకున్నారు. ఆయన ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న తరుణంలోనే 1970లో కొండకొడిమ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేవలం 22 సంవత్సరాల వయస్సులోనే ఆయన సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆతర్వాత కూడా 1981, 1987లో కొండకొడిమ సర్పంచ్‌గా వరుసగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఆయన రాజకీయ గురువు ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన తొలి మాజీ మంత్రి శీలం సిద్దారెడ్డి. కొండబాల సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే 1987లో పూర్వపు గొల్లపూడి సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికై డీసీసీబీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆతర్వాత సర్పంచ్ పదవిలో ఉంటూనే 1992లో గొల్లపూడి సొసైటీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నుంచి ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఏకకాలంలో సర్పంచ్, సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్, డీసీసీబీ చైర్మన్ పదవులు నిర్వహించిన ఘనత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొండబాలకే దక్కింది. 1971లో ఛాంబర్ ఆఫ్ పంచాయతీరాజ్ జిల్లా పంచాయతీ కమిటీ మధిర సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1981లో పూర్వపు మధిర సమితిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్పఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ రాజకీయాల నుంచి వైదొలిగి 1985లో తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన తర్వాత 1987లో డీసీసీబీ డైరెక్టర్‌గా, 1992లో డీసీసీబీ చైర్మన్‌గా, 1998లో భద్రాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా పదవులు నిర్వహించారు. 1999లో మధిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో టీడీఎల్పీ కోశాధికారిగా పనిచేశారు. సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడిగా, డీసీసీబీ డైరెక్టర్, డీసీసీబీ చైర్మన్, భద్రాచలంట్రస్టు బోర్డు చైర్మన్, మధిర ఎమ్మెల్యేగా తనదైన ముద్ర వేసుకున్నారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరిన కొండబాల 2017 నుంచి 2023 వరకు ఏకంగా ఆరు సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొనసాగారు. ఆయన తిరిగి మళ్లీ తాను రాజకీయ ఓనమాలు దిద్దిన కాంగ్రెస్‌లో ఈ ఏడాది ఆగస్టు 4వ తేదీన చేరారు.



సైబర్ నేరంలో... ఆ నలుగురు

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ కేంద్రంగా ఆస్ట్రేలియా పౌరులను మోసగించి రూ.కోట్లు కొల్లగొట్టిన కాల్ సెంటర్ గుట్టును స్పెషల్ ఆపరేషన్ టీం, సైబర్‌క్రైం పోలీసులు రట్టుచేశారు. ఈ కేసులో పోలీసులు మొత్తం తొమ్మిది మందిని అరెస్టుచేయగా అరెస్టయిన వారిలో ఇద్దరు ఖమ్మం జిల్లా వేంసూరు, కల్లూరు మండలాలకు చెందిన వారున్నారు. కల్లూరు మండలానికి చెందిన మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు. రూ.కోట్లు కొల్లగొట్టిన ఈ కేసులో ప్రధాన నిందితులు ఇద్దరితో పాటు మరో ఇద్దరు సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో ప్రస్తుతం నియోజకవర్గంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది.

హైటెక్‌సిటీ కేంద్రంగా కాల్‌సెంటర్ పేరుతో మోసం
క్రైంలో నలుగురు ఖమ్మం జిల్లా వ్యక్తులు
రూ.పది కోట్ల వరకూ ఆర్థిక నేరం
ప్రధాన నిందితులిద్దరూ పరారీ.
మరో ఇద్దరు అరెస్టు
ఎర్రబోయినపల్లిలో రెండు రోజుల క్రితం సైబర్ క్రైం పోలీసుల తనిఖీలు

సత్తుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన ప్రవీణ్, ప్రకాశ్‌లు సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో రిట్జ్ ఐటీ సొల్యూషన్స్ పేరుతో గతేడాది కాల్ సెంటర్‌ను ప్రారంభించారు. కాల్ సెంటర్ నిర్వాహణ బాధ్యతలను కల్లూరు మండలం లింగాల గ్రామానికి చెందిన యేపూరి గణేష్ (30) (టెలికాలర్), వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన మారంపాడు చెన్నకేశవ (26)లకు అప్పగించారు. ఆస్ట్రేలియా పౌరులకు నకిలీ ఈ-మెయిల్స్ పంపి వారి కంప్యూటర్లను ఆధీనంలోకి తీసుకునే వారు. మీ కంప్యూటర్లు హ్యాక్ అయ్యాయని వారిని నమ్మించి సమస్య పరిష్కారం కోసం కస్టమర్ కేర్‌ను సంప్రదించాలని ఫోన్ నెంబర్ ఇచ్చే వారు. బాధిత ఆస్ట్రేలియన్లు ఫోన్‌చేస్తే సమస్య తెలుసుకునే పేరుతో ఎనీడెస్క్ సాఫ్ట్‌వేర్ ద్వారా వారి కంప్యూటర్లను ఆధీనంలోకి తీసుకొని వారి బ్యాంకు ఖాతా, తదితర వివరాలు సేకరించే వారు. బ్యాంకు ఆన్‌లైన్ లాగిన్ ఐడీలు సేకరించి వారి ఖాతా నుంచి డబ్బులను డబ్బు బదిలీ చేసుకునే వారు. ఆ డబ్బును బదిలీ చేసుకునేందుకు అస్ట్రేలియాలో ఉంటూ చదువుకునే విద్యార్థుల ఖాతాలను ఉపయోగించుకునే వారు. అందుకు విద్యార్థులను నమ్మించి వారికి కొంత మొత్తంలో కమిషన్ ఇచ్చే వారని పోలీసులు తెలిపారు. ఈ రకంగా మళ్లించిన డబ్బును హవాలా, క్రిప్టో కరెన్సీ ఇతర మార్గాల్లో తీసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ రకంగా ఆస్ట్రేలియాలోని భారతీయుల 45 ఖాతాలు వాడుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆ నిందితులు ఆస్ట్రేలియన్ల ఖాతా నుంచి రూ.8 నుంచి రూ.పది కోట్ల వరకూ బదిలీ చేసుకున్నారని పోలీసులు గుర్తించారు. మొత్తంగా ఈ సంఘటన పోలీసులకు సమాచారం అందడంతో కేసు దర్యాప్తు చేసి మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారిలో కల్లూరు, వేంసూరు మండలాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. కాల్ సెంటర్‌లో పని చేస్తున్న మిగిలిన ఏడుగురు కోల్‌కత్తాకు చెందిన వారున్నారు.

ఎర్రబోయినపల్లిలో రెండు రోజుల క్రితం సోదాలు

కేసు దర్యాప్తులో భాగంగా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలోని ప్రవీణ్ ఇంటిలో సైబర్‌క్రైం పోలీసులు సోదాలు చేశారు. సోదాలు చేసిన విషయం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. సోదాలు జరుపుతున్న క్రమంలో ప్రధాన నిందితులు పరారయ్యారు. సోదాల సందర్భంగా ఇంటిలో ఉన్న ల్యాప్‌టాప్‌ను సీజ్ చేసిన

సర్పంచ్ పదవి కోసం రూ.కోటి ఆఫర్..

నిందితుల్లో ఒకరు సర్పంచి పదవికి పోటీ చేసేందుకు సిద్ధపడినట్లు తెలిసింది. మూడో విడత జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. తనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.కోటి ఇస్తానని నిందితుడు ఓపెన్ ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఈ ప్రతిపాదనను స్థానికులు అంగీకరించలేదు. ఆఫర్ ఇచ్చిన వ్యక్తి బీఆర్ఎస్‌లో ఉన్నతస్థాయి నాయకులతో పరిచయాలు ఉండటం వారితో కలిసి ఉన్న ఫోటోలు కూడా వైరల్ కావటంతో అధికార పార్టీ నాయకులు ఏకగ్రీవంగా వదిలేందుకు నిరాకరించి పోటీకి ఏర్పాట్లు చేశారు. ఈ ఆఫర్ ఇచ్చిన కొద్దిగంటల్లోనే సైబర్ పోలీసులు రంగప్రవేశం చేయటంతో మొత్తం గుట్టురట్టయి కథ అడ్డం తిరిగింది.

సైకిల్‌పై నేపాల్‌కు..

ఖమ్మం నుంచి బయల్దేరిన యువకుడు



తన ఇంటి నుంచి నేపాల్ యాత్రకు బయల్దేరుతున్న ఫాజిల్ హిందుస్థానీ

ఖమ్మం అర్బన్ డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మంకు చెందిన యువకుడు ఫాజిల్ హిందుస్థాని సైకిల్‌పై నేపాల్ యాత్రకు బయల్దేరాడు. ఖమ్మంలోని చైతన్యనగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం, చాందినీల కుమారుడైన ఈ యువకుడు మంగళవారం ఈ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఇతను పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో కొంతకాలం ఉద్యోగం చేశాడు. ఏదైనా సాధించటం ద్వారా తన ప్రత్యేక నిరూపించుకోవాలన్న తలంపుతో ఉద్యోగాన్ని వదిలేసి తాను ఎన్నాళ్లనుంచో అనుకుంటున్న యాత్రకు శ్రీకారం చుట్టాడు. రోజుకు 80 నుంచి 100 కిలోమీటర్ల లక్ష్యంతో తన సైకిల్ యాత్రను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ప్రణాళిక రూపొందిచుకున్నాడు. బస చేసేందుకు, వంట చేసుకునేందుకు అవసరమైన టెంట్, తదితర సామగ్రిని సిద్ధం చేసుకున్నాడు. దేశ సమగ్రతను చాటిచెపుతూ అనేక రాష్ట్రాల్లో సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, వేషభాషలు, తదితర కళలను అధ్యయనం చేస్తూ యాత్రను సాగించనున్నట్లు పేర్కొన్నాడు. పర్యటనలో తాను చూసిన వింతలు, విశేషాలు, అనుభవాలను దేశ ప్రజలందరికీ చూపే ఉద్దేశ్యంతో వీడియోలు రూపొందించి ఇండియా వాలా వ్లాగర్ అనే తన యూట్యూబ్ చానెల్‌లో అప్‌లోడ్ చేస్తానన్నాడు. తాను చదువుకున్న న్యూవిజన్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో నేపాల్‌యాత్రకు బయల్దేరాడు. జెండా ఊపి యాత్రను ప్రారంభించటంతోపాటు అధ్యాపకులు ఫాజిల్‌ను అభినందించారు. యాత్ర విజయవంతం కావ్వాలని ఆకాంక్షించారు.

శ్రీకృష్ణ ఆలయంలో గీతా జయంతి వేడుకలు

భద్రాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా గోపూజా మహోత్సవం, భగవద్గీత అష్టోత్తర శత సహస్రనామ పూజ నిర్వహించారు. అలాగే పంచముఖ ఆంజనేయ స్వామి సన్నిధిలో 11సార్లు హనుమాన్ చాలీసా మండల పారాయణం నిర్వహించారు. పూజాకార్యక్రమాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




గోమాతకు పూజ చేస్తున్న దృశ్యం

సీఎం సారు ఉద్యమకారులను మరిచారా..!

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించిన ఉద్యమకారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం సార్ తెలంగాణ ఉద్యమకారుల పోరాటాలు త్యాగాలు మరిచారా అని గుర్తుచేస్తూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఉద్యమకారులు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఉద్యమకారుల గడ్డకు మంగళవారం విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సాదర స్వాగతం పలుకుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాతలుగా కొనియాడ పడుతున్న ఉద్యమకారులకు పెన్షన్ ప్రకటించాలని, హెల్త్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వెసులుబాటు, రవాణా సౌకర్యాలు, పెద్దమ్మకారుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. దేశంలోనే కొత్తగూడెం కేంద్రంగా ఏర్పాటు చేసిన మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభిస్తున్నందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు ఉద్యమకారుల తరుపున తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ట్రేడ్ యూనియన్ నాయకులు గొల్లపల్లి దయానంద్, ఉద్యమకారులు శ్రావణబోయిన నరసయ్య, శ్రీపాద సత్యనారాయణ, సైమన్, రమణమూర్తి, ప్రసాద్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మూడు లీటర్ల నాటుసారా పట్టివేత



నాటుసారాను, బైక్‌ను స్వాధీనం చేసుకున్న కొత్తగూడెం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సుజాతనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం పరిసర ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మూడు లీటర్ల నాటు సారాను కొత్తగూడెం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనంపై నాటుసారాను తీసుకువెళ్తున్న కరివారిగూడెంకు చెందిన భూక్యా రాంబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఇతని వద్ద నుంచి నాటుసారాను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్న ట్లు డీటీఎఫ్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది రామకృష్ణ గౌడ్, వెంకటనారాయణ, రమేష్, పార్థసారథి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దమ్మపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సీతారామ కాలువ పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నాగుపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం సహదాల్ జిల్లా, కుసరాయిటోల్ గ్రామానికి చెందిన రాంసింగ్ గోండ్(25) సీతారామ కాలువ పనులకు డ్రిల్లింగ్ ఆపరేటర్‌గా పని చేసేందుకు వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం డ్రిల్లింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు డ్రిల్లర్ 11కేవీ విద్యుత్ వైర్లకు తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతను కొద్దిసేపటికే మృతి చెందాడు. కాలువ పనులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ ఇందుకూరి కృష్ణంరాజు దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆంధ్రా నుంచి ధాన్యం లారీలు రాక..

అడ్డుకున్న కట్టుకాసారం రైతులు

గుట్టుగా వ్యాపారుల దందా...
పొంతన లేని సమాధానాలు చెప్పిన లారీడ్రైవర్లు
10 లారీలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అధికారులు



ధాన్యం లారీలను అడ్డుకున్న కట్టుకాసారం రైతులు

నేలకొండపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కట్టుకాసారం మీదుగా వస్తున్న ధాన్యం లారీలను సోమవారం ఉదయం కట్టుకాసారంలో రైతులు అడ్డుకున్నారు. ధాన్యం లారీలను ఆపివేసి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు కట్టుకాసారం వెళ్ళి పంచనామా నిర్వహించి, లారీలను నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు జరిగే ప్రతీసీజన్‌లో వందల కొద్దీ ధాన్యం లారీలు ఆంధ్రా నుంచి తెలంగాణాలోకి రావటం ఆనవాయితీగా మారింది. కొన్నిసార్లు ధాన్యం లారీలను రైతులు అడ్డుకుని నిలిపి వేయడం, అధికారులు పరిశీలించి అన్నీ కరెక్టుగానే ఉన్నాయని వదిలివేయడం అలవాటుగా మారింది. గత సీజన్లో వల్లభి చెక్‌పోస్టు వద్ద పదుల సంఖ్యలో లారీలను పట్టుకున్నారు. కానీ తర్వాత వదిలేశారు. అప్పట్లో వాటిపై పెద్దఎత్తున దుమారం రేగింది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు.. పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతుంటాయనే ప్రచారంసైతం ఉంది. దీన్ని అలవాటుగా తీసుకున్న కొంతమంది వ్యాపారులు ఆంధ్రా నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి, తెలంగాణలో అమ్ముకోవటం ద్వారా, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను పొందటంతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను అక్రమంగా పొందుతున్నారనే ప్రచారం ఉంది.

పొంతన లేని సమాధానాలు చెప్పిన లారీల డ్రైవర్లు

రైతులిచ్చిన సమాచారంతో కట్టుకాసారం వెళ్ళిన అధికారులు, లారీడ్రైవర్ల నుంచి వివరాలు రాబట్టటానికి ప్రయత్నం చేశారు. కానీ ఎటువంటి సమాధానం రాలేదని తెలుస్తున్నది. ఎక్కడి నుంచి ధాన్యం లోడ్ చేసుకుని వస్తున్నారు. ఎక్కడకు తీసుకెళతున్నారు. అనేది స్పష్టంగా చెప్పలేదనేది సమాచారం. కాగితాలు సైతం కరెక్టుగా లేవని తెలుస్తున్నది. కొన్ని ముదిగొండ మండలం వల్లభి నుంచి అని ఉన్నట్లు ఉందని సమాచారం. రైతులు అడ్డుకోవటానికి ముందే పదుల సంఖ్యలో లారీలు వెళ్లినట్లు చెపుతున్నారు.

యజమానులను పిలిపిస్తున్నాం..

లారీ డ్రైవర్లు ఇచ్చిన సమాచారం మేరకు లారీల యజమానులకు కబురు చేసామని చెప్పారు. యజమానులు వచ్చాకనే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. డీటీ సివిల్ సప్లయీస్ విజయ్‌బాబు, ఎమ్మార్వో మధుసూదన్‌రావులు పంచనామా నిర్వహించిన వారిలో ఉన్నారు.

సీఎం రేవంత్ కాన్వాయ్ తనిఖీ



కూసుమంచి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని టోల్‌ప్లాజా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌ను పోలీసులు తనిఖీలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మంజిల్లా సరిహద్దు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే కొత్తగూడెంలో జరిగే ప్రజాపాలన సంబురాల్లో పాల్గొనేందుకు రానున్న నేపథ్యంలో ముందుగా సీఎం కాన్వాయ్ జిల్లాకు చేరుకుంది. సీఎం చాపర్ ద్వారా రానున్నారు. పంచాయతీ ఎన్నికల వేళ అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

పోలీసుల ఆధీనంలో రేషన్ బియ్యం లారీ

పైన సాధారణ బియ్యం.. కింద పౌరసరఫరాల బియ్యం
ఆంధ్రప్రదేశ్ టూ ఛత్తీస్‌గఢ్‌కు రవాణా
పట్టుకున్న భద్రాద్రి జిల్లా చండ్రుగొండ పోలీసులు



చండ్రుగొండ పోలీసుస్టేషన్‌లో ఉన్న బియ్యం లారీని పరిశీలిస్తున్న డీటీ వెంకటేశ్వర్లు

చండ్రుగొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): లారీలో అక్రమంగా తరలిస్తున్న 300క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సోమవారం చండ్రుగొండ పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై కొత్తగూడెం డీటీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రా ప్రాంతం నుంచి ఛత్తీస్‌గడ్‌కు రవాణా అవుతున్న సుమారు 300క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని చండ్రుగొండ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకొని పౌరసరఫరా శాఖకు సమాచారం ఇచ్చామన్నారు. దీంతో స్టేషన్‌లో ఉన్న లారీలోని బియ్యాన్ని పరిశీలించగా పైవరసలో సాధారణబియ్యం ఉండగా లోపలి బస్తాలన్ని రేషన్ బియ్యంతో ఉన్నాయన్నారు. పోలీసుల విచారణ తర్వాత లారీని పౌరసరఫరా శాఖకు అప్పగిస్తారని, అనంతరం విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.

నాలుగేళ్ల చిన్నారి అనుమానాస్పద మృతి

అదృశ్యమై.. నీటిసంపులో విగతజీవిగా లభ్యం
ఆరు గంటల తర్వాత గుర్తింపు
పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు
చిన్నారి మృతిపై పలు అనుమానాలు



చిన్నారి ప్రాన్సీ(ఫైల్)

ఇల్లెందురూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఓ చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గేటుకు తాళం వేసి ఉన్న ఇంటి ఆవరణలో మూత వేసి ఉన్న నీటి సంపులో విగతజీవిగా కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. ఇల్లెందు మండలం సుంకరిగూడెం గ్రామంలో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. ఇల్లెందు మండలం మామిడిగూడెం గ్రామపంచాయతీ సుంకరిగూడెం గ్రామానికి చెందిన కాలం ప్రభాకర్, తేజ్యా దంపతుల కుమార్తె కాలం ప్రాన్సీ(4) సోమవారం ఉదయం ఇంటి ఎదుట ఆడుకుంటోంది. రోజులాగే తండ్రి క్యాటరింగ్ పనికి వెళ్లగా.. తల్లి తేజ్యా ఇంటి వెనుకాల దుస్తులు ఉతికే పనిలో నిమగ్నమైంది. కొద్దిసేపటి తర్వాత ఇంటిఎదుట ఆడుకుంటున్న కుమార్తె కనిపించకపోవడంతో తేజ్యా చుట్టుపక్కల వెతికింది. ఆ తర్వాత విషయం గ్రామస్థులకు చెప్పడంతో గ్రామస్థులు కూడా వెతికినా ప్రాన్సీ ఆచూకీ దొరకలేదు. దీంతో తేజ్యా తన భర్తకు సమాచారమిచ్చి ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తొలుత గ్రామంలోని ఇళ్లిల్లు వెతకాలని పోలీసులు సూచించడంతో ప్రాన్సీ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామస్థులు సుమారు ఆరు గంటలపాటు ఇళ్లిల్లు వెతికారు. ఈ క్రమంలోనే నీటి సంపులను కూడా పరిశీలించారు. అయితే చిన్నారి ఇంటికి కొద్ది దూరంలోని ప్రధానగేటుకు తాళం వేసి ఉన్న ఓ ఇంటి ఆవరణలో మూత పెట్టి ఉన్న నీటిసంపులో ప్రాన్సీ విగతజీవిగా కనిపించింది. అయితే ప్రాన్సీ మృతదేహం లభ్యమైన తీరును చూస్తే మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి మృతి చెందిన సంపు ఉన్న ఇంటి ప్రధాన గేటు తాళం వేసి ఉండడం, ఆ గేటును చిన్నారి ఎక్కి కానీ, కింది నుంచి దూరి వెళ్లే అవకాశం లేకపోవడంతో అసలు ఆ చిన్నారి ఎలా లోపలికి వెళతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక కొంతభాగం వరకు కూడా నీరు లేని సంపులో ప్రాన్సీ విగతజీవిగా కనిపించడం, కనీసం ఆమె దుస్తులు పూర్తిగా తడవకపోవడం, పైగా నీటి సంపు మూత వేసి ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారి ప్రాన్సీని చంపి నీటిసంపులో పడవేశారని తల్లిదండ్రులు, గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాన్సీ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇల్లెందు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేశారు.

ఐఈఎల్ట్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిగ్రీ పాసైన విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించేందుకు కీలకమైన ఐఈఎల్ట్స్(ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజస్)కు ఉచిత శిక్షణకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్కాలర్ షిప్‌లు పొందడం లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి, ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ. శ్రీలత తెలిపారు.

రుద్రాక్ష, కరంగళి మాలల ఎగ్జిబిషన్



ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బైపాస్‌రోడ్డులో ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్లో రుద్రాక్ష, కరంగళి మాలల ఎగ్జిబిషన్ను సోమవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఏకముఖ రుద్రాక్షలనుండి 21 కలిగిన రుద్రాక్షలు, కరంగళి మాలలు, సాలీగ్రాంలు,దక్షణావృత శంకులు. రుద్రాక్షమాలలు, వెండితో అల్లిన కరంగళి మాలలు ప్రదర్శలో ఉంచామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రదర్శన ఈనెల9 వరకు నిర్వహించనున్నట్లు ప్రముఖ రుద్రాక్ష నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

బార్ కౌన్సిల్ అభ్యర్థి సుజాత ప్రచారం



ఖమ్మంలీగల్,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఖమ్మంబార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది కూరపాటి సుజాత మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అదేవిధంగా న్యాయవాదుల సంక్షేమ నిధిని పెంచటానికి, సమస్యల పరిస్కారం కొరకు చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయగలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కేజీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కరుణాకర్

ఖమ్మంరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మిక సంఘం నాల్గవ రాష్ట్ర మహాసభలు సూర్యాపేట జిల్లాలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రసహాయ కార్యదర్శిగా రూరల్ మండలం, గోళ్ళపాడుకు చెందిన కొండం కరుణాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలి

» జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ నరేందర్

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, హెచ్ఐవీ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, ఏలా సంక్రమిస్తాయో తెలిస్తే వాటిని నియంత్రించ వచ్చని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం నరేందర్ అన్నారు. సోమవారం ఏఆర్టీ సెంటర్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ నరేందర్ మాట్లాడుతూ ఏఆర్టీలో మందులు వాడుతున్న బాధితులు ప్రతీనెలా క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. వీటితో పాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఎయిడ్స్ సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి తప్ప వచ్చిన తర్వాత మందులను వినియోగిస్తే దాని ప్రభావాన్ని కొంత మేరకు తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం ఏఆర్టీలో క్రమం తప్పకుండా మందులు వాడుతున్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సురేందర్, డీపీఎం స్వప్న మాధురి, ఏఆర్టీ వైద్యులు డాక్టర్ పి.మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మణ్ రావు, డాక్టర్ జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ రహిత జిల్లాగా మార్చాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రామారావు

ఖమ్మంఖానాపురంహవేలి: ఖమ్మం జిల్లాను హెచ్ఐవీ రహిత జిల్లాగా మార్చాలని, ముఖ్యంగా యువత హెచ్ఐవీ గురించి పూర్తిగా అవగాహన తెచ్చుకొని సమాజంలో అందరికీ హెచ్ఐవి పట్ల అవగాహన పెంపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.రామారావు అన్నారు. ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన అధికారులతో నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. అందరూ హెచ్ఐవి టెస్ట్ చేయించుకోవాలని, హెచ్ఐవి టెస్ట్ చేయించుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ వి.సుబ్బారావు మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ కంట్రోల్ సొసైటీ విధించిన లక్ష్యాలను అందుకోవడంలో జిల్లా ముదంజలో ఉందని అన్నారు. జాతీయస్థాయిలో క్విజ్ కాంపిటీషన్లో విజేతగా నిలిచిన ఏఎస్ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిని దేవి శ్రీప్రసన్నను సత్కరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వేణుమాధవ్ రావు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, యం.నరేంద్ర, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు



జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న ఎక్స్‌రే ప్లాంట్

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాజనరల్ ఆస్పత్రిలో సోమవారం కొత్తఎక్స్‌రే ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్లు రెండు ఉన్నాయి. అయితే వీటిలో ఒక ప్లాంట్‌కు తరచుగా మరమ్మతులు సంభవిస్తూ మూలన పడింది. సుమారు ఏడాది నుంచి ఒకే యంత్రంపై ఎక్స్‌రే తీస్తున్నారు. రోగులు అధికంగా రావడం నిత్యం కనీసం 300 వరకు ఎక్స్‌రేలు తీస్తున్నారు. దీంతో ఒకేమిషన్‌పై తీస్తుండడంతో దానిపై ప్రభావం పడుతోంది. ఈనేపథ్యంలో మూలన పడిన ప్లాంట్‌లో కొత్త మిషన్‌ను తెప్పించారు. అక్కడ సోమవారం టెక్నీషియన్లు దాన్ని ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఈ మిషన్ అత్యంత ఆధునికమైందని 500 ఏంఏ సామర్థ్యంతో పనిచేస్తుందని ఎక్స్‌రే స్పష్టత బావుంటుందని తెలిపారు. త్వరలో దీన్నిఅందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆస్పత్రి అధికారులు చెప్పారు.

ఖజానాశాఖ డీడీగా శ్రీనివాసరెడ్డి



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వై శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు హన్మకొండలో ఏటీవోగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని ఖమ్మం ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దానిలో భాగంగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది నూతన డీడీకి స్వాగతం పలికారు. ఇప్పటి వరకు పనిచేసిన డిప్యూటీ డైరెక్టర్ కొనసాగిన వెంటపల్లి సత్యనారాయణకు జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది సబ్‌ట్రెజరీల సిబ్బంది సన్మానించారు.



ప్రజాపాలన లక్ష్యంతో జోనల్ వ్యవస్థ

» నాల్గో జోన్ కార్యాలయం ప్రారంభంలో మేయర్ నీరజ



జోనల్ అధికారులతో మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఇందిరమ్మ రాజ్యం అమలు జరుగుతుందని, ప్రజాపాలనకొనసాగుతుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సోమవారం మమతా రోడ్డులో ఈస్ట్ జోనల్ కార్యాలయాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. జోనల్‌కార్యాలయంలో గదులు, ఉద్యోగుల సౌకర్యాలను పరిశీలించారు. జోనల్ పరిధిలో డివిజన్లు కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. ఈస్ట్‌జోన్ కార్యాలయం ద్వారా విలీన ప్రాంత ప్రజల చెంతకు పౌరసేవలు అందుబాటులోకి వస్తాయనితెలిపారు.జోనల్ కార్యాలయాలు ఏర్పాటుతో ప్రతి 10 డివిజన్లుకు ఒకజోనల్ కార్యాలయం అందుబాటులోకి వచ్చిందన్నారు.జోనల్ కార్యాలయాలకు కేటాయించిన అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు స్థానికంగా కార్పొరేటర్లు, ప్రజలకు అందుబాటులో ఉండి తక్షణ సేవలు అందిస్తారని వివరించారు. డిప్యూటీ మేయర్ పాతిమాజోహారా, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఆర్వో సుధాకర్, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, ఆర్ఐలు శ్రీనివాస్, నాగరాజు కమ్యూనిటీ ఆర్గనైజర్ చిలకా ద్రౌపది, శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, వార్డుఆఫీసర్లు ప్రత్యూష, అనురాధ, శైలజా, మురళీ ఆర్పీలు భయ్యా వరలక్ష్మీ, సయ్యద్ సహీన్ పాల్గొన్నారు.

బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న తాతా మధు

ఖమ్మంమార్కెట్,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రఅన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరులసమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ప్రకటించిన 42శాతం రిజర్వేషన్ అసలు అమలుకాని సెంబర్ గేమ్ అన్నారు. జిల్లాలో 571 గ్రామ పంచాయతీలు ఉంటే 22.2 శాతం ప్రకారం రావాల్సిన 127 సర్పంచి స్థానాలకుగాను కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9.1శాతం అంటే 54 సర్పంచ్ స్థానాలను మాత్రమే బీసీలకు ఇచ్చిందని పేర్కొన్నారు. అదే బీసీలకు చేసిన పెద్ద ద్రోహమన్నారు. జిల్లాలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఎక్కువగా సర్పంచి స్థానాలు రిజర్వేషన్ చేసినట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధమని అన్నారు. ఎన్నికల సమయంలో జిల్లాల పర్యటనకు ముఖ్యమంత్రి రావడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని సీఎం పర్యటనలను ఎలక్షన్ కమిషన్ అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. అనేక మోసపూరిత హామీలనుఇచ్చి అధికారంలోకి వచ్చిని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికలలో బుద్ధి చేప్పాలని అన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బిచ్చాల తిరుమల రావు, మక్బూల్, మాటేటి నాగేశ్వరరావు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి సీఐటీయూ

ఖమ్మంరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పక్షపాతి సీఐటీయూ సంఘమేనని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముదాం శ్రీనివాస్‌రావు అన్నారు. మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గ్రామమహాసభ తెల్దారుపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 లేబర్ కోడ్‌లను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడంహేయమైన చర్య అన్నారు. కార్మికులంతా కుల,మత ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా ఉండి కార్మిక రాజ్యస్థాపనకు కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన గ్రామకమిటీని 17 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐతగాని రవి, లక్ష్మయ్య, యలమందరావు, భద్రాజి, ఉపేందర్, చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు 'హార్వెస్ట్' విద్యార్థి



మణికంఠను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): త్వరలో రాజస్థాన్ రాష్ట్రజరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు తమ కళాశాలలో ఇంటర్‌ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.మణికంఠ ఎంపికైనాడని కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. మణికంఠ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికయ్యాడు.

విభలో 'న్యూవిజన్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి):విజ్ఞాన్ భారతి (విభ) డిజిటల్ బేస్‌డ్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ప్రతిభా పరీక్షలో న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి తదుపరి పోటీలకు అర్హత సాధించారని పాఠశాల చైర్మన్ ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ కార్తీక్, స్ఫూర్తి సోమవారం తెలిపారు. ఈ పరీక్షకు పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులలో ఒకరు స్టేట్ టాపర్‌గా నిలిచాడని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ప్రతీ పల్లెలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

(5వ పేజీ తరువాయి)

గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఏడేళ్ల పాటు డీసీసీ అధ్యక్షుడుగా పార్టీ కోసం పని చేసిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సేవలు మరువలేనివని ప్రశంసించారు. తొలుత భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీఆర్ఎస్‌ది మాటల ప్రభుత్వమని, కాంగ్రెస్ రెండేళ్ల పాలన చేతల ప్రభుత్వమని, ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు బిల్లును ప్రవేశపెట్టామని, గవర్నర్ ఆమోదించలేదని, ఢిల్లీలో ధర్నా చేసినా కేంద్రం నుంచి స్పందన లేదన్నారు. అయినప్పటికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ శాతం బీసీలకు అవకాశం కలిపిస్తున్నామన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ద్వారా పంచాయతీల అభివృద్ధి మరింతగా జరగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు, నాయకులకు సముచిత న్యాయం కలిపిస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు ఘనమైన చరిత్ర ఉందని.. జలగం వెంగళరావు, బొమ్మకంటి సత్యనారాయణ, శీలం సిద్ధారెడ్డి వంటి నాయకులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారని, వారి స్ఫూర్తితో ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. తాను 40 ఏళ్లగా రాజకీయాల్లో ఉన్నా, కాంగ్రెస్‌పార్టీలో చేరినప్పుడు అందరు తనను ఆహ్వానించి ఆదరించారని, తనకు జిల్లా అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ముఖ్యమని తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాకు అవసరమైన యూనివర్శిటీని మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ పేరుతో కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తున్న ఘనత ఈప్రభుత్వానిదన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలతో పాటు రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, పార్టీ కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. నూతన అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకుని కృషిచేస్తానని, అందరి సహకారాలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మాజీజిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ నగర మాజీ అధ్యక్షుడు జావీద్, నూతన అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి,అనుబంధాల సంఘాల అధ్యక్షులు, నాయకులు సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ



ప్రతిభ చాటిన దీక్ష

తిరుమలాయపాలెం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలోని కూస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 9వతరగతి విద్యార్థిని దీక్షా జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటింది. ఖమ్మంలో జరిగిన పోటీల్లో 600 మీటర్ల పరుగుపందెలో ప్రథమస్థానంలో నిలిచింది. ఆమెను ఎంఈవో శ్రీనివాసరావు, ఎస్‌వో రమాకుమారి, తదితరులు అభినందించారు.

హెల్పింగ్ హ్యాండ్స్‌సేవలు అభినందనీయం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



విద్యార్థికి ల్యాప్‌ట్యాబ్ అందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కొనియాడారు. సభ్యులు చావా రమేష్‌బాబు ఆర్థిక సహకారంతో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి జువేరియా తరుణమ్‌కు రూ.50 వేల ల్యాప్‌స్టాప్‌ను సోమవారం ఆయన అందజేశారు. జువేరియా తరుణమ్ తండ్రి చిన్నతనంలోనే మరణించడం, తల్లి పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌గా చిరుద్యోగంతో కుటుంబాన్ని పోషించడంతో ఈ సాయాన్ని అందించారు. నగరంలోని పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఈకార్యక్రమం జరిగింది.హెల్పింగ్ హాండ్స్ కన్వీనర్, పీఆర్టీయూ జిల్లామాజీ అధ్యక్షుడు యలమద్దివెంకటేశ్వర్లు,వైవి.చావా చైతన్య, స్టేట్ ఆడిట్ కమిటీ చైర్మన్ ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, చిత్తలూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఏకగ్రీవం దిశగా.. ధర్మాతండా,లాల్‌సింగ్‌తండా

» గ్రామాభివృద్ధికి నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఇద్దరు

కూసుమంచి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేసుకునేందుకు నాయకులు, ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా కూసుమంచి మండలంలోని రెండుపంచాయతీలు ఏకగ్రీవం దిశగా పయనిస్తున్నాయి. లాల్‌సింగ్‌తండ, ధర్మాతండలో ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవంగా పాలకవర్గాలను నియమించుకున్నట్లు తెలిసింది. లాల్‌సింగ్‌తండాలో భూక్యా కోటేశ్వరరావు సతీమణి సావిత్రి ఏకగ్రీవం కానున్నట్లు తెలిసింది. గ్రామస్థులు నిర్వహించుకున్న సమావేశంలో సర్పంచి.. గ్రామాభివృద్ధికి తనవంతుగా రూ.14 లక్షలు అందజేస్తానని చెప్పడంతో పార్టీలకు అతీతంగా ఏకగ్రీంగా ఎన్నుకోనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఏకగ్రీవం అయితే రూ.10లక్షల నజరానా ఉన్నందున ఆ నిధులతో పాటు, సావిత్రి ఇచ్చే వితరణతో గ్రామం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

అలయ నిర్మాణానికి ముందుకు...

మండల పరిధిలోని మరో గ్రామపంచాయతీ ధర్మాతండాలోనూ ఏకగ్రీవం కానున్నట్లు తెలిసింది. తండాలో అలయ నిర్మాణానికి రెండున్నర కుంటల భూమి, నిర్మాణానికి రూ.10లక్షలు వితరణగా ఇస్తానని సర్పంచి అభ్యర్థి ముందుకు రావడంతో ఏకగ్రీవం కానున్నట్లు సమాచారం. గతలోకల్ బాడీ ఎన్నికల్లోనూ ఈతండా ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని నియమించుకున్నారు. గత సర్పంచ్ మూడు కుంటల భూమిని వితరణగా అందించారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



కూసుమంచి,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో పలుకుటుంబాలు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని కోక్యాతండకు చెందిన మాజీ సర్పంచి ఎర్రనాగుల పాండ్య, బూబూరావు, శంకర్, రవి ఆధ్వర్యంలోనూ, కొత్తూరు గ్రామానికి చెందిన లొడిగ వెంకటరమణ, బజ్జూరి ఉపేందర్‌రెడ్డి రమణారెడ్డి, నక్క గోపి తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కందాళ ఉపేందర్‌రెడ్డి వారిక కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

37 మద్యం బాటిళ్ల స్వాధీనం

రఘునాథపాలెం,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాలలో రఘునాథపాలెం పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాల ఆధ్వర్యంలో పలు బెల్టుషాపుల్లో తనిఖీలు నిర్వహించారు. వివెంకటాయపాలెంలోని ఓ బెల్టుషాపులు 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

ఊపందుకున్న నామినేషన్ల పర్వం

తిరుమలాయపాలెం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్లు సోమవారం ఊపందుకున్నాయి. మండలంలోని 40గ్రామపంచాయతీలకు గాను ఆయా గ్రామాల్లో భారీఎత్తున సర్పంచ్, వార్డు పదవులకు నామినేషన్లు వేశారు. సర్పంచ్‌కు సుమారు 60నుంచి70వరకు నామినేషన్లు వేశారు. 356 వార్డులకు గాను 61వార్డులకు నామినేషన్లు వేశారు. సుబ్లేడులో అభ్యర్థి నామినేషన్ తరుఫున జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్ స్థానాలకు మొత్తం 64 నామినేషన్లు

ఖమ్మంరూరల్: మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు సోమవారం నాటికి సర్పంచి స్థానాలకు మొత్తం 64 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వార్డులకు 157మంది నామినేషన్లు వేయడం జరిగింది. సోమవారం మంచిరోజు కావడంతో సాయంత్రం 4గంటల తరువాత నామినేషన్ల పర్వం జోరుగా కొనసాగింది. రాత్రి వరకు నామినేషన్లు కొనసాగాయి. సోమవారం సర్పంచ్ స్థానాలకు 56 మంది నామినేషన్లు వేశారు. 154 మంది వార్డులకు నామినేషన్లు వేశారు.

మేమెంతో మాకు అంత రిజర్వేషన్ కావాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మేమెంతో మాకంత రిజర్వేషన్ కావాలని జాతీయ బీసీ కమీషన్ మాజీచైర్మన్ జిస్టస్ ఈశ్వరయ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశరదన్ మహారాజ్, తెలంగాణ ఉద్యమకారుడు విఠల్ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జిల్లా బీసీ ఎస్సీ, ఎస్టీ, జేఏసీ ఆవిర్భావ సభలో వారు పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్ కార్యాలయంలో కోలాహలం

డీసీసీ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి కదిలిన కార్యకర్తలు



నూతన అధ్యక్షుడ్ని సన్మానిస్తున్న పువ్వాళ్ల

ఖమ్మంకార్పొరేషన్,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో కోలాహలం కనిపించింది. తాజా మాజీఅధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకార ఏర్పాట్లు చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నూతన అధ్యక్షుడ్ని ఘనంగా సన్మానించారు.ఉదయం నుంచి నగరంలో సంబురాలు కనిపించాయి. తెలంగాణ ప్రదేశ కమిటీ రాష్ట్ర నాయకుడు కటికల రాజేష్ ఆధ్వర్యంలో కార్లు, ద్వి చక్రవాహన ర్యాలీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాత్రి 7గంటల వరకు డీసీసీ కార్యాలయానికి వచ్చి నూతన అధ్యక్షుడ్ని సన్మానించారు. తాజా మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యం, ఎస్సీసెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడ మెక్కా శేఖర్‌గౌడ్ వార్వారి మండల, గ్రామ విభాగాల నాయకులతో కలిసి నూతన అధ్యక్షుడిని సన్మానించారు.

నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో సత్తుపల్లి మండలం కిష్టారంలోని నామినేషన్ కేంద్రాన్ని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ ఆక స్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వసతులు, ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఎంపీడీఓ నాగేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. 3వ విడతలో భాగంగా ఈనెల 17న ఎన్నికలు జరగనుండగా మండలంలోని 21గ్రామ పంచాయితీలకు గానూ 208వార్డులకు నామినేషన్లను ఈనెల 3నుంచి 5వరకు స్వీకరించనున్నామని చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం 2గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ద్వారా విజేతలను ప్రకటించనుండగా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు.

మొన్న మొంథా.. నేడు దిత్వా

» తుఫాన్లతో బెంబేలెత్తుతున్న రైతులు



టార్పాలిన్ పట్టాలపై చేరిన నీటిని తొలగిస్తున్న రైతు



స్టేజీ పినపాక వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై కప్పిన టార్పాలిన్ పట్టాలు

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రాంత రైతులను బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ వణికిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అతివృష్టితో అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. చివరికి తాము నమ్ముకున్న వరిపంట చేతికొచ్చిన సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ఇక్కడ అన్నదాతల వెన్నులో వణుకుపుట్టిస్తోంది. ఖరీఫ్ వరిసాగు చేసిన రైతులు ముమ్మరంగా వరి నూర్పిడిళ్లలో నిమగ్నమయ్యారు. గత నెలలో సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా ఈదురుగాలులు, వర్షాలకు వేలాది ఎకరాల్లోని వరిపంట నేలమట్టమైంది. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు నిబంధనల పేరిట కంటితుడుపుగా పంట అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. మొంథా తుఫాన్ నష్టం భారీన పడిన రైతులు ఆ భారం నుంచి బయటపడకముందే ఇప్పుడు దిత్వా తుఫాన్‌తో రెండురోజుల నుంచి ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో వరి కోసిన రైతులు ధాన్యాన్ని తమకందుబాటులో ఉన్న కల్లాలు, రోడ్లపైన ఆరబోశారు. ప్రభుత్వం సన్నరకాలు క్వింటా ఒక్కింటికి రూ.500బోనస్ ఇస్తుందనే ఆశతో లక్షలాది బస్తాల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు ధాన్యాన్ని సిద్ధం చేసుకున్నారు. ఈ తరుణంలోనే దిత్వా తుఫాన్‌తో వర్షాలు కురుస్తుండడంతో కల్లాలు, రోడ్లపై ఆరబోసిన లక్షలాదిబస్తాల ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. ధాన్యం రాశులపై టార్పాలిన్, పరదా పట్టాలు కప్పినప్పటికీ వర్షపు నీరు వాటిపై చేరాయి. వాటిని తొలగించేందుకు రైతులు నిద్రహారాలు మాని రోడ్లు, కల్లాల్లోనే ఉంటున్నారు. ఇంత జరుగుతున్నా సకాలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీసంచులు సరఫరా చేయడం లేదని ఫలితంగా తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. మొత్తంగా దిత్వా తుఫాన్ రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

సత్తుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సోమవారం ప్రారంభించారు. మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో పొదిలి రవికుమార్, కొవ్వూరి నాగరాజు, షేక్ ఆరీఫ్, పెదగౌండ్ల కృష్ణమోహన్, ఉత్తరవెల్లి చిట్టెమ్మ, జూపూడి సుజాహెలెన్‌లు నూతనంగా గృహాలను నిర్మించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన సాయంతో తాము నిర్మించుకున్నామని, తమకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేను అభినందిస్తూ లబ్ధిదారులు శాలువాతో సన్మానించారు. కమిషనర్ కొండ్రా నర్సింహ, హౌసింగ్ ఏఈ పవన్, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, పద్మజ్యోతి, దూదిపాల రాంబాబుతో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



భూషయ్య ఆశయాలకు కృషి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



భూషయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ఏన్కూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్ణయానికి కట్టుబడి, పార్టీ బలోపేతానికి కృషిచేసిన మేడా భూషయ్య ఆశయసాధన కోసం కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మేడా భూషయ్య సంస్మరణ సభ సోమవారం ఏన్కూరులో నిర్వహించారు. ఈ సభ మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్ అధ్యక్షతన జరగగా భూషయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. పార్టీకి ఆయన చేసిన సేవలన కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, జిల్లానాయకులు తెప్పాల సత్యం, అమరనేని వీరభద్రం, చంద్ర నరేంద్రకుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బొంతు రాంబాబు, దొంతిబోయిన నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు విజయబాయి, టీడీపీ నాయకుడు తాళ్లూరి అప్పారావు, జనార్ధన్ పాల్గొన్నారు.

ఆ వార్డుల ఏకగ్రీవం లాంఛనమే!

» ఒక్కో వార్డుకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు

కొణిజర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లోగల 254 వార్డులకు గాను ఆయా గ్రామాల్లో 22 వార్డులు ఏకగ్రీవం కానున్నాయి. ఆ 22 వార్డులకు ఒక్కో వార్డుకు ఒక్కనామినేషన్ మాత్రమే పడడంతో పోటీ చేసిన అభ్యర్థుల విజయం సులభంకానున్నది. 22వార్డుల్లో అన్నవరంలో ఆరు వార్డులు, చిన్నమునగాలలో ఒకటి, గోపవరంలో 2, గుబ్బగుర్తిలో ఒకటి, గుండ్రాతిమడుగులో ఒకటి, కొణిజర్లలో 2 వార్డులు, పెద్దగోపతిలో 5 వార్డులు, రాజ్యాతండాలో ఒకటి, రామనర్సయ్యనగర్‌లో ఒకటి, తీగలబంజరలో 2 వార్డులు ఏకగ్రీవం కానున్నాయి.

సర్పంచ్‌ల ఏకగ్రీవానికి కసరత్తులు:

మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో ఐదు పంచాయతీలలో ఏకగ్రీవం చేసేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. వార్డులు ఒక పార్టీకి, ఉపసర్పంచ్ ఒక పార్టీకి, సర్పంచ్ ఒక పార్టీకీ తీసుకునే విధంగా ఒప్పందాలు జరుగుతున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం ఎంపీటీసీలో కూడ ఉంటాయని చర్చ జరుగుతోంది. గ్రామాభివృద్ధి జరగాలంటే ఏకగ్రీవంతోనే సాధ్యమని ఆయా పార్టీలు అభిప్రాయపడుతున్నాయి. మండల పరిధిలోని తనికెళ్ల, కొణిజర్ల, చిన్నమునగాల, తీగలబంజర, మేకాలకుంట గ్రామాలలో ఏకగ్రీవం కోసం రాజకీయపార్టీలు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. ఓ గ్రామంలోని పొత్తుల వ్యవహారం ఎమ్మెల్యే వద్దకు వెళ్లినట్లు సమాచారం. ఏ ఒప్పందాలైన ఒక్కరోజు మాత్రమే గడవు ఉంది. ఈనెల 3న ఉపసంహరణలతో బరిలో ఉండేదెవరో తేలనున్నాది.

ఎన్నికల సామగ్రి ఏర్పాటులో అధికారులు

కారేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సామగ్రి ఏర్పాటులో మండలస్థాయి, అధికారులు, పంచాయతీ సిబ్బంది బిజీ బిజీగా ఉన్నారు. 3 విడతల్లో నామినేషన్లు మొదలు 17న జరగనున్న పోలింగ్ వరకు అవసరమైన ఎన్నికల సామగ్రి తయారిలో నిమగ్నమయ్యారు.



సామాగ్రి ఏర్పాటులో సిబ్బంది

ప్రతీ శుక్రవారం వాడపల్లికి డీలక్స్ బస్సు

» సత్తుపల్లి ఆర్టీసీ డీఎం సునీత

సత్తుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లికి ప్రతి శుక్రవారం ఇకనుంచి డీలక్స్ సర్వీస్ నడపనున్నట్లు సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఊటుకూరి సునీత సోమవారం తెలిపారు. ఆంధ్రాలో తిరుపతి, ద్వారకా తిరుమలల తరువాత అత్యంత ప్రజాధరణ పొందిన క్షేత్రం కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి. గోదావరి నదీతీరం వెంబడి అందమైన పచ్చని పొలాల మధ్యగల ఈ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందగా ఏడువారాల వెంకన్నగా పిలుస్తున్నారు. ఈ శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల సందర్శనార్థం ప్రతి శుక్రవారం రాత్రి 10గంటలకు సత్తుపల్లి బస్టాండ్ నుంచి బయల్దేరి వాడపల్లికి చేరుకున్న తర్వాతిరోజు దర్శనానంతరం ఉదయం 8గంటలకు తిరుగు ప్రయాణమవుతుంది. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, రాజమండ్రి తర్వాత వాడపల్లికి చేరుకునే ఈ బస్సులో చార్జీలు పెద్దలకు రూ.630, పిల్లలకు రూ.340గా నిర్ణయించగా ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా ముందస్తుగా టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని డీఎం చెప్పారు. వివరాలకు 9866619189 (వీబీఓఆనందరావు), 9550767375, 9959225962 సంప్రదించలన్నారు.

బాలికలు అవగాహనతో ఉండాలి: సీఐ

ముదిగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల బాలికలు అవగాహన కలిగి ఉండి అపరిచిత వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఓ.మురళీ సూచించారు. ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే విషయాలు తప్పనిసరిగా పాటిస్తూ చదువుపై దృష్టి సారించినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలుగుతారని పేర్కొనన్నారు. ఎస్ఐ గుమ్మడి హరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ పల్లెలో.. కాంగ్రెస్ జెండా ఎగరాలి

(5వ పేజీ తరువాయి)

గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఏడేళ్ల పాటు డీసీసీ అధ్యక్షుడుగా పార్టీ కోసం పని చేసిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సేవలు మరువలేనివని ప్రశంసించారు. తొలుత భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీఆర్ఎస్‌ది మాటల ప్రభుత్వమని, కాంగ్రెస్ రెండేళ్ల పాలన చేతల ప్రభుత్వమని, ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు బిల్లును ప్రవేశపెట్టామని, గవర్నర్ ఆమోదించలేదని, ఢిల్లీలో ధర్నా చేసినా కేంద్రం నుంచి స్పందన లేదన్నారు. అయినప్పటికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ శాతం బీసీలకు అవకాశం కలిపిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ద్వారా పంచాయతీల అభివృద్ధి మరింతగా జరుగుతుందన్నారు. పాలమూరు, రంగారెడ్డి నుంచి సీతారామ ఎత్తిపోతల వరకు అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు విడుదల చేస్తున్న ఈప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు, నాయకులకు సముచిత న్యాయం కలిపిస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు ఘనమైన చరిత్ర ఉందని.. జలగం వెంగళరావు, బొమ్మకంటి సత్యనారాయణ, శీలం సిద్ధారెడ్డి వంటి నాయకులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారని, వారి స్ఫూర్తితో ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామపంచాయతీ, మండల, జిల్లాపరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. తాను 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా, కాంగ్రెస్ పార్టీలో చేరినప్పుడు అందరు తనను ఆహ్వానించి ఆదరించారని, తనకు జిల్లా అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ముఖ్యమని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవసరమైన యూనివర్శిటీని మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ పేరుతో కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలతో పాటు రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండాఎగరాలని, పార్టీ కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. నూతన అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకుని కృషిచేస్తానని, అందరి సహకారాలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మువ్వావిజయ్‌బాబు, కాంగ్రెస్ నగర మాజీ అధ్యక్షుడు జావీద్, నూతన అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, అనుబంధాల సంఘాల అధ్యక్షులు, నాయకులు సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైరాలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

» జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా వైరాలో సోమవారం కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించింది. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణతో కలిసి జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు దొబ్బల సౌజన్య, కొప్పురావూరి శబరీనాథ్, ధార్న రాజశేఖర్, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, పమ్మి అశోక్, బత్తుల గీత తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఆత్మహత్య చేసుకుంటానని యువకుడి హల్‌చల్



మండలపరిషత్ భవనంపైకి ఎక్కిన గోపి

తల్లాడ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): భార్య ఫిర్యాదు మేరకు పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చిన యువకుడు మండల పరిషత్ కార్యాలయ భవనంపైకి ఎక్కి అక్కడ నుంచి దూకుతానంటూ హల్‌చల్ చేశాడు. సోమవారం ఖమ్మం జిల్లా తల్లాడలోని మండలపరిషత్ కార్యాలయం భవనంపైకి తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెదిన మాదుగుల గోపి ఎక్కి అక్కడ నుంచి దూకుతానంటూ బెదిరింపులకు దిగాడు. గోపి భార్య రేణుకతో గొడవపడ్డాడు. దీంతో గోపిపై రేణుక తల్లాడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు పోలీసు స్టేషన్‌కు గోపిని తీసుకువచ్చారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన గోపి మండల పరిషత్ కార్యాలయం భవనం ఎక్కి దూకుతానని బెదిరింపులకు దిగాడు. ఈ సమయంలో తన దగ్గర ఉన్న బ్లేడ్‌తో చేతిపై కోసుకున్నాడు. భవనంపై ఉన్న గోపికి తహసీల్దార్ టి.కరుణాకరరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబుతోపాటు స్థానికులు సర్దిచెప్పడంతో దిగివచ్చాడు.

పంట వ్యర్థాలు భూమికి బలం: డీఏవో

చింతకాని, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంట వ్యర్థాలు భూమికి బలమని డీఏవో ధనసారి పుల్లయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని వందనం, కొదుమూరు గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. వందనం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పంట అవశేషాలను కాల్చుతుండగా పంట వ్యర్థాల వినియోగంపై రైతుకు అవగాహన కల్పించారు. అవశేషాలను కాల్చడం వల్ల భూమికి మంచి చేసే సూక్ష్మజీవులు నశించి భూమి నిస్సారం అవుతుందన్నారు. వ్యర్థాలు భుమిలో కలియదున్నడం ద్వారా భూమికి ఎరువుగా మారే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఏఈవో ఆయేషా పాల్గొన్నారు.

మధిర పాత శ్మశానవాటికను కాపాడాలి

మధిర రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధిర ఎస్సీ కాలనీకి చెందిన పాత శ్మశాన వాటిక దశాబ్దకాలంగా పూర్తిగా నిర్లక్ష్యానికి గురై పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని దీన్ని కాపాడాలని ఆ కాలనీ పెద్దలు, యువకులు సోమవారం మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఒక వినతి పత్రం అందజేశారు. శ్మశాన వాటికలో రాత్రివేళల్లో అసాంఘీక కార్యక్రమాలు జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. పాత, కొత్త శ్మశాన వాటికలను అభివృద్ధి పరిచి వినియోగంలోకి తీసుకురావాలని ఆ వినతిపత్రంలో వారు కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

జీపీవోల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రవి



పెనుబల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారుల సంక్షేమసంఘం మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చింతగూడెం జీపీవో బాణోతు రవి, ఉపాధ్యక్షురాలిగా లంకపల్లి జీపీవో నేరటి శారదా, ప్రధానకార్యదర్శిగా కారాయిగూడెం జీపీవో తాటి నాగరాజు, సహాయ కార్యదర్శిగా పెనుబల్లి జీపీవో షేక్.నాగూల్‌మీరా, మహిళా అధ్యక్షురాలిగా కోండ్రుపాడు జీపీవో తేనె బేబీ, కోశాధికారిగా ఏరుగట్ల జీపీవో మేకల ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన అధికారి

» కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న బీఆర్ఎస్ నాయకులు

కల్లూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మండలంలోని వెంకటాపురం గ్రామంలో కల్వర్టు వద ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ సర్వే చేయడంపై తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మండల బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. సోమవారం కల్లూరు మాజీ జడ్పీటీసీ బీఆర్ఎస్ నాయకులు కట్టా అజయ్‌కుమార్, నర్వనేని అంజయ్య మాజీ సర్పంచు మోదుగు సుబ్బారావులు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కోరారు.

కోడ్ ఉల్లంఘనకు పాల్పడలేదు:

ఆర్‌అండ్‌బీ జేఈ రవీంద్ర

వెంకటాపురం గ్రామంలోని ప్రధాన రహదారిపై గల కల్వర్టు వర్షాకాల సమయంలో ప్రమాదకరంగా మారినందున భవిష్యతులో నూతన వంతెన నిర్మాణంపై అంచనా రూపొందించేలా శాఖ పరంగా సర్వే చేయటం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే తాము ఈ సర్వే చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన అనేది అవాస్తవమని ఆయన ఖండించారు. తాను ఈ కల్వర్టు ప్రదేశంలో రాజకీయ ప్రమేయం లేదని అవసరమైతే తన ఫోన్ కాల్ డేటాను పరిశీలించ వచ్చునని చెప్పారు.



కల్వర్టు వద్ద సర్వే చేస్తున్న ఆర్‌అండ్‌బీ ఇంజనీర్

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మిర్చి తోటలను పరిశీలిస్తున్న రైతు సంఘం బృందం

ఏన్కూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైరస్‌లతో దెబ్బతిన్న మిర్చి రైతులను వెంటనే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏన్కూరులో మిర్చి తోటలను రైతుసంఘం బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది అధిక వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. మిర్చిసాగు కోసం రైతులు ఎకరానికి కౌలుతో కలిపి లక్షన్నర రూపాయలు ఖర్చు చేసి పంట పూర్తిగా తొలిగించడంతో రైతులకు కోలుకోలేని దెబ్బతగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు నండూరి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా లక్ష్మా, దొంతబోయిన నాగేశ్వరరావు, వేల్పుల రాములు, లింగయ్య, రవి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు

అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం పలుచోట్ల వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో జరిపే లైంగిక సంబంధాలు వల్ల ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వైద్యులన్నారు.



బోనకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడలో..





ఏన్కూరులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో



ఎర్రుపాలెంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



సత్తుపల్లిలో..



దెండుకూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు



మధిరలో..

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

» విలేకరుల సమావేశంలో కల్లూరు ఎస్ఐ హరిత

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కల్లూరు ఎస్ఐ హరిత అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఎస్ఐ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై రెచ్చగొట్టే వ్యాఖలతో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఇతరులకు హాని కలిగించే పోస్టులు షేర్ చేసిన నేరంగా పరిగణించి గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యులుగా చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.

పెనుబల్లిలో తొమ్మిది కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ

పెనుబల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో 32 గ్రామపంచాయతీలు, 290వార్డులకు ఈనెల 3నుంచి 5వతేదీ వరకు మూడోవిడత నామినేషన్లు స్వీకరించేందుకు తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో అన్నపూర్ణ తెలిపారు. తాళ్లపెంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాళ్లపెంట, బ్రహ్మలకుంట, కర్రాలపాడు, గంగదేవిపాడు పంచాయతీలతోపాటు 36వార్డులు, పెనుబల్లి పంచాయతీ కార్యాలయంలో పెనుబల్లి, వీఎం బంజర్, టేకులపల్లితోపాటు 34వార్డులు, లింగగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో పార్థసారథిపురం, లింగగూడెం, భవన్నపాలెంతోపాటు 26వార్డులు, లంకపల్లిలో లంకపల్లి, కొత్త లంకపల్లి, ఏరుగట్ల, రామచంద్రాపురంతోపాటు 34వార్డులు, రామచంద్రరావుబంజర్‌లో రామచంద్రరావుబంజర్, ఎడ్లబంజర్, మండాలపాడు, చౌడవరంతోపాటు 34వార్డులు, తెలగవరంలో తెలగవరం, కారాయిగూడెం, పాత అగ్రహారం, కందిమళ్లవారి బంజర్‌తోపాటు 34వార్డులు, చింతగూడెంలో చింతగూడెం, గణేశులపాడు, కొత్తకారాయిగూడెంతోపాటు 28వార్డులు, బయ్యన్నగూడెంలో బయ్యన్నగూడెం, కుప్పెనకుంట్ల, పాత కుప్పెనకుంట్ల, తుమ్మలపల్లితోపాటు 36వార్డులు, కోండ్రుపాడులో కోండ్రుపాడు, అడవిమల్లెల, సూరయ్యబంజర్‌తండాల్లో సర్పంచ్ పదవులకు, 28వార్డు సభ్యుల నుంచి నామినేషన్లను ఈనెల 3నుంచి 5వతేదీ సాయంత్రం 5గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని ఆమె తెలిపారు.